[illegible]

(ఆంధ్రవ్యాసము.)

దిగవల్లి వేంకటశివరావు, బి.ఏ.,బి.యల్.

ఆంధ్రభాషా ప్రయోగములు.

పోతన వేమనల యుగము.

చెన్నపురి రాజధాని కళాశాలవారి

1922 సంవత్సరపు పటేల్ అండ్ మాక్ స్వాన్

బహుమానము (రు 150 లు) పొందిన

ఆంధ్రవ్యాసము.

దిగవల్లి వేంకటశివరావు, బి.ఏ., బి.ఎల్.,

విజ్ఞానచంద్రికవారి దక్షిణాఫ్రికా చరిత్ర,

గ్రంథకర్త.

శారదా భాండార ముద్రాశాల, బెజవాడ.

ముద్రితము.

1924.

సర్వస్వామ్య సంకలితము.] [వెల రు. 0-8-0.

అంకితము.

బ్రహ్మశ్రీ॥ మ॥రా॥రా॥శ్రీ ఆంధ్రవాల్మీకి,

వావిలికొలను సుబ్బారావు పంతులుగారికి.

విషయ విభాగము.

ఉపోద్ఘాతము.

- కాలము; కృతులు; పరస్పర సంబంధము.
- రాజుల యాస్థానములు.
- సంఘము, మతము, ఆచారవ్యవహారములు.

పోతన వేమనలు వారి కాలము.

- అభిప్రాయ భేదములు.
- 14, 15 శతాబ్దముల దేశచరిత్ర.
- ఆంధ్రదేశ రాజకీయస్థితి.
- సంఘముయొక్కస్థితి.
- ఆర్థికస్థితి వాణిజ్య వ్యవసాయములు.
- మతములు వానిస్థితి శైవవైష్ణవములు అద్వైతము.
- వాఙ్మయము.

పోతనకృతియందీస్థితి గతులకు నిదర్శనములు.

- కవి యభిప్రాయములు.
- రాజులనుగూర్చి.
- సంఘమునుగూర్చి.
- మతమునుగూర్చి.
- ఉదాహరణములు.

పోతనకృతి విమర్శనము.

శ్రీమదాంధ్ర మహాభాగవతము.

ఒక పురాణము—ఆంధ్రీకరణము.

కథాచమత్కృతి.

పాత్రపోషణము. శ్రీకృష్ణపాత్రము.

పురుష, స్త్రీ పాత్రములు.

రసపోషణము.

కవితా విషయములు.

పోతన కృతులను కొనబడు

వీరభద్ర విజయము.

భోగినీదండకము.

నారాయణశతకము,

వేమనకృతి విమర్శనము.

వేమన రాజకీయ. సంఘ. మత విమర్శనములు.

వేమన నీతులు.

రసపోషణము.

వేమన జీవితము.

వేమన కవితము.

పోతనవేమనలయుగము.

భాషాభివృద్ధికి దేశాభివృద్ధి మూలకారణము. అందువలననే వాఙ్మయచారిత్రము దేశచారిత్రమునుబట్టి యుండును. దేశమునందలి, ఆయాకాలముల రాజకీయసాంఘికమతస్థితి, ఆయాకాలపు వాఙ్మయమునందు ప్రతిబింబితమగుచుండును. జనుల యభిప్రాయములు, భావములు, చేష్టలు నాగరీకము ను వాఙ్మయమునఁ గలపాత్రములలో కనబడుచుండును. ఒకకాలమున బాగుగనున్న సంగతు లింకొకకాలమున బాగుగనుండవు. ఒకకాలమున భూషింపఁబడు నాచార మింకొకకాలమున దూషింపఁబడును. దీనికిఁ గారణము ప్రజలయభిప్రాయములు మారుచుండుటయే.

మనదేశమున కవులు రాజుల యాశ్రయమునుండి వారి విభవము ననుభవించుచు, కృతులు చెప్పుచుండిరి. అందు తమకిష్టమగు సంగతులను పొగడుచు తమకనిష్టమగువానిని నిరసించుచు విమర్శించుచుండిరి. కవులను పోషించుటయు, వారిచే కృతులందుటయు నొకగౌరవముగ మనరాజులును సామంతులు నెంచుచుండిరి. కవులఘంటపుఁబోటులకు రాజాధిరాజులును వెఱచుచుండిరి. ఆకాలపుస్థితి శ్రీనాథుని చారి

త్రిమువలన మనకు బాగుగ తెలియుచున్నది. ఆయన కాలమునాటి రాజులనుగూర్చి వారిప్రజలనుగూర్చి, మతములను గూర్చి వారితో కలసిమెలసియుండి గౌరవింపఁబడిన శ్రీనాథుఁడు తనకృతులలో బాగుగవర్ణించినాఁడు. ఇట్లే తక్కిన కవులును తమప్రబంధములలో తమకాలపుస్థితిని వెల్లడించినారు.

రాజకీయ పరివర్తనములనడుమ, సాంఘికాందోళనములలో, ఆచారవ్యవహారములు కలతఁజెందినకాలమున భిన్నమతములు విజృంభించినకాలమున, మానవులకు శాంతిని శ్రేయమునుకలిగించు భక్తియోగమునుబోధించి కలతనుదీర్చి, సర్వజనులకును సమ్మతమును శుభదాయకమునగు దైవభక్తిని ప్రేమమయుఁడగు శ్రీకృష్ణుని చారిత్రమువలన కలిగించిన పరమభాగవతోత్తముఁడు, శ్రీమదాంధ్ర మహాభాగవతమును మనకొసంగి కృతార్థుఁడైన మహాపురుషుఁడు, పోతన. ఈకవి చాలదారిద్ర్యము ననుభవించెను. తనచుట్టును తనకన్న మిన్నలుకాని, సాధారణకవులు రాజులనుకొలిచి వారినిపొగడి వారివలన ధనమునుగొని సుఖించుట నితఁడు చూచినాడు. కాని, ఇతనిమనసుతిరుగలేదు. ఇతనికాలపుస్థితిగతులు బాగుగలేవు. తుచ్ఛసుఖములకితఁడాసఁజెందలేదు. ఐహికసుఖములరోసి వానినిఖండించెను. ఇతఁడుతనకాలపు

రాజులను "మనుజేశ్వరాధములను"చున్నాడు. వారివలనఁ గొన్ని సొమ్ములు, పురములు వాహనములు పుచ్చుకొని నరకమునబడి పోవుటకిచ్చగింపక, స్వార్థపరత్వముమాని పరమార్థ చింతనముతో భాగవతమును రచియించి రామునకంకితము చేసి జన్మముసఫలము చేసికొనెను.

ఇఁక వేమన యన్ననో చాల తెలివిగలవాఁడు. చదువుకొనినవాఁడు; మంచి కుటుంబములోనివాఁడు. అతఁడు జ్ఞాని యోగి. ఇతనికి హేమకార విద్య తెలియునని పలువురితని నాశ్రయించి తిరుగుచుండిరి కాని, ఇతఁడు వారి సాహాయ్యము నపేక్షింపక, భోగములను త్యజించి, ఊరూరఁ దిరుగుచు, ధనము నార్జించుపనిమాని తత్వజ్ఞానము నుపదేశించుచు, తాను చూచిన ఆచారవ్యవహారములను విమర్శించుచు, నీతులను బోధించుచు, స్వార్థత్యాగము చేసెను.

పోతనకాలము పదునైదవ శతాబ్దియని నిర్వివాదాంశము అయినను, ఇతఁడే ప్రదేశమున జన్మించెను, ఎచ్చటనుండెను, ఎచ్చట నాంధ్ర భాగవతమును రచించె నన్నవిషయము తగవులకు చోటిచ్చినది. ఆయన 'ఏకశిలానగర'మని చెప్పినాఁడు. ఇది ఓరుగల్లా? ఒంటిమెట్టయా? ఇందు రెండు కక్షులవారు బయలుదేరి తగవులాడిరి. ఈ తగవులతో మనకుఁబనిలేదు. ఆకాలమున నీ రెండుచోటులను గల రాజకీయ సాంఘికమత

స్థితులు తెలిసికొనినచో మనకు శ్రేయస్కరము ఇఁక వేమన కాలమునుగూర్చి మొన్న మొన్నటివఱకును పలువురు పలు విధములుగ తలచిరి. కొందఱు పదునేడవ శతాబ్దమనిరి కొందఱు పదునాఱనిరి, కొందఱు పదియనిరి! ఈమధ్య వంగూరి సుబ్బారావుగారు "వేమన"అను విమర్శ గ్రంథ మొకటివ్రాసినారు. అది ఇప్పుడె ప్రకటింపబడినది. ఇదియుగాక, వారీమధ్య నొక వ్యాసమును పత్రికలలో ప్రకటించినారు. కొన్నికారణములను చూపుచు వారు వేమన 1412 లోపుట్టి 1480 వఱకును జీవించెనని సహేతుకముగ నిర్ణయించినారు అతఁడు కొండవీడులోపుట్టి గండికోట మొదలగుస్థలములలో పెరిగి కటారు పల్లెలో చనిపోయెననియు, ఊరు రఁదిరుగుచు నాంధ్రదేశమెల్ల సంచరించినటుల వ్రాసినారు వేమన పద్యములలో నొక ప్రతిలోని పద్యమున బేర్కొనబడిన శైవగురువులలో సోమశేఖర పండితుఁ డితనిగురువట. ఇతఁడు పోతన్నగారికిఁ గూడ గురువట. వేమన చిత్రపట మొకటి దొరికినటుల కూడ వ్రాసినారు ఈపరిశోధనమె నిజమయ్యెనేని, ఆంధ్రవాఙ్మయ చారిత్రమున నొకగొప్ప విశేషము బయల్పడినట్లు సంతసింపవలసినదె. ఈ వ్యాసములో కాలనిర్ణయవిచారము చేయుట కెడము లేకపోవుట నింతటితో విరమించి కథాంశమునకు రావలెను. పెద్దలు పూజ్యులునగు, ఈకాలపు పండితులు,

తదితర పరిశోధకులు, ఈవిషయములను చర్చించి, విమర్శించి నిర్ణయించువఱకును, ప్రస్తుతము చేయఁబడిన సిద్ధాంతమును నమ్మి, పోతనయు వేమనయు నించుమించుగ నొకేకాలమున పదునైదవ శతాబ్దమున నుండిరని తలచి ఆకాలమునాటి ఆంధ్రదేశపు రాజకీయస్థితియు, సాంఘికస్థితియు నెట్టులుండెనో, అవి పోతనవేమనల కృతులందెంతవఱకు నాదర్శితములయ్యెనో పరిశీలించి కృతివిమర్శనకు వత్తము.

దక్షిణ హిందూదేశస్థితి.

తురుష్కులు దండయాత్రలు సలుపుటకుమున్ను దక్షిణ హిందూదేశమున మూడు స్వతంత్ర రాజ్యములుండెడివి. అందు మొదటిది సేవుణరాజ్యము. దీని రాజధాని దేవగిరి. ఇది మహారాష్ట్ర దేశమునందుంటచే మహారాష్ట్ర సామ్రాజ్యమని వ్యవహరింపఁబడెను. రెండవది కాకతీయ సామ్రాజ్యము. దీని రాజధాని ఓరుగల్లు. ఇది ఆంధ్రదేశమునందుంటవలన దీని నాంధ్రసామ్రాజ్యమనిరి. మూడవది హొయిసల సామ్రాజ్యము. దీనిరాజధాని ద్వారసముద్రము. తురుష్కుల దండయాత్రవలన నీమూడు రాజ్యములును గ్రమముగ నస్తమించినవి. తూర్పు తెలుంగు దేశముయొక్క ముఖ్యపట్టణమగు నోరుగల్లును మహమ్మదీయులు 1323లో వశముచేసుకొనిరి. ద్వారసముద్రమును 1327లో వశముచేసుకొనిరి. మహమ్మదీయుల ధాటికెదిర్చి నిలిచి హిందూవైభవమును నిలుపు

టకు సంగను రాజపుత్రులగు ఐదుగురన్నదమ్ములు పాటుపడిరి. వీరే నూత్నకర్నాటక సామ్రాజ్య స్థాపకుల మూలపురుషులు. విన్సెంటు స్మిత్తుగారి ఆక్సుఫర్డు హిందూదేశచరిత్ర.

„ఆంధ్రనగరమునజరిగిన ఘోరసంగ్రామములలో నోరుగంటి ప్రతాపరుద్రుఁడు డిల్లీచక్రవర్తిచే నోడింపబడి చెఱగొనిపోఁబడుటయు ఆంధ్రవీరులనేకులు యుద్ధమున వీరస్వర్గముచూరగొనఁ బోవుటయుఁ గాకతీయసామ్రాజ్య లక్ష్మి డిల్లీ తురుష్కవీరుల క్రౌర్యము నకుఁ దాళజాలక, పరాభూతయై, ఆంధ్రనగరంబున నొకక్షణమైన నిలువ నొల్లక, ప్రతాపరుద్ర ధనాగార రక్షకులగు హరిహర బుక్కరాయలతోడి చెలిమిఁ జేసి, దగువకర్ణాటక భూములకు పాఱివచ్చి, భయార్తయగుచు, నూత్న వరాన్వేషణ చిత్తయై త్రిలింగ కర్ణాటకభూములలో నటు నిటు బరువిడుచు చిందులు త్రొక్కనారంభించెను. కర్ణాటాంధ్రభూములలో విగ్రహారాధన ద్వేషమతాభి నిరతులైన నూత్నజాతి ముసల్మాను వీరులు ప్రవేశించి నపుడు త్రిలింగ కర్ణాటక వీరప్రపంచంబుకలింగి, సంక్షుభితమయ్యెను. బలాఢ్యులయిన శాత్రవులు దండెత్తి వచ్చి తమదుర్గములాక్రమించుకొని ప్రతాపాగ్ని ప్రజ్వలింపఁ జేయుచుండ, రాచవారు కమ్మవారు రెడ్డినాయకులు బలిజనాయకులు పద్మనాయకులు నేకమై, వైరివీరులను తరిమి

ప్రతాపరుద్రునికిఁ బట్టముగట్టి యాంధ్ర సామ్రాజ్యము నుద్ధరించుటకు బదులు, స్వార్థపరులై, ఒకదేశీయుల మను మాట మరచి, యదువృష్ణి భోజాంధకులవలెనె యొండొరుల గొంతుకలు కోసికొనుచు, నాంధ్రభూతలమును రక్తపూరితముఁ గావించుచుండిరి". ఆంధ్రుల చరిత్ర.

ఆంధ్రనగరమును దత్ప్రాంతములును మహమ్మదీయుల వశమయ్యెను. డిల్లీచక్రవర్తి తన పెద్దకొమరుఁడగు నలూపుఖానుని దక్షిణదేశమునకుఁ బాలకునిగ నియమించెను. ప్రాగాంధ్ర కళింగముల పైనగూడ దాడివెడలిరి. రాజమహేంద్రవరముకూడ తురుష్కుల వశమయ్యెను. అలూపుఖాను సింహాసనమెక్కెను. ఇతఁడే మహమ్మదు బిన్ తొగ్లకు. ఇతని పిచ్చి ప్రభుత్వమున దక్షిణముననున్న మహమ్మదీయుల ప్రభుత్వము నాశమయ్యెను. తెలుగునాయకులు చిన్న రాజ్యములను వదలించుకొనిరి. మహమ్మదీయపాలకులె చక్రవర్తిని లక్ష్యపెట్టక స్వతంత్ర రాజ్యములను స్థాపించిరి. వారిలోనొకఁడు 1347 నాటికి బహమనీ సామ్రాజ్యమును స్థాపించెను. ఇది 1518 వరకును దక్షిణమున నుచ్చస్థితిలోనుండెను. ఇందు పదునాలుగు సుల్తానులు పరిపాలించిరి. వీరిలో నలువురు బలవన్మరణములనొందిరి. ఇరువురు పదభ్రష్టులై కన్నులఁ గోల్పోయిరి. ఈసుల్తానులలో నైదవవాఁడుతప్ప తక్కిన

వారెల్లరు క్రూరులు సుఖలోలురు తమతోడి హిందూరాజు లతో నెల్లప్పుడును పోరాడుచుండిరి. వీరెన్నో ఘోరకృత్యములు చేసిరి. అయినను వీరు ఇస్లాముమతమును విద్యలను ప్రోత్సహించిరి. వీరియొక్క గుణములను పరిపాలనాక్రమమును 1470 మొదలు 1474 వఱకును బీదరులో వసించి సంగతులనెల్ల బాగుగ గమనించిన రష్యాదేశపు వర్తకుఁడగు అతనేసియస్ నికెటినను వాఁడు బాగుగ వర్ణించినాఁడు. వీరెల్లప్పుడును విజయనగర రాజులతోను, తెలుగు నాయకులతోను, పోరుచుండిరట. వీరిరాజ్యమున జనసంఖ్య మెండుగనుండెనట. గొప్పవారు సమస్త సౌఖ్యములు ననుభవించుచుండినను, సామాన్యజనులు చాల దురదృష్టవంతులుగనుండిరట. వారిసైన్యములు జనసమూహములుగనుండి స్త్రీలతో పరివారజనముతో వర్తకులతోనుండెనట. యుద్ధములన దోపిడిలునట! ఓరుగల్లు మఱల వృద్ధిలోనికి వచ్చెనుగాని మహమ్మదీయులు దానిని పూర్తిగ నాశనముచేసిరి.

ఆంధ్రదేశ రాజకీయస్థితి.

ఈకాలమున నాంధ్రదేశమును తెలుగునాయకులు పాలించుచుండిరి. ఓరుగల్లునకును శ్రీశైలమునకును మధ్యదేశమున నీకాలమున బాలించినవారు రేచర్లవంశజులు. అందు సింగమనాయఁడు ననపోతనాయఁడును మాధవభూపాలుఁడును

ఘనులు. వీరు, ఒకవంక బహమనీసుల్తానులతో నొకవంక రాచవారితో నింకొకవంక రెడ్లతోడను పోరాడుచుండిరి. వీరు రాచకొండదుర్గముననుండిరి. భైరవప్రతిష్ఠల నెన్నో చేసిరి. వీరితరువాత రెండవ సింగమనాయఁడు రాజ్యముచేసెను. ఇతఁడును, బహమనీసుల్తానగు మహమ్మదుషాహియు కర్ణాటాంధ్రభూపతియగు రెండవ హరిహరరాయలును సమకాలికులు. సుల్తానుసాత్వికుఁడగుటవలన నతనితో కలహము లేకున్నను రెండవహరిహరరాయలొకమాఱు దాడివెడలివచ్చుటనాతని నెదిరించెను. ఈసింగనవిద్వాంసుఁడేయైనను, రసార్ణవసుధాకరాది సంస్కృతగ్రంథములను రచించి సర్వజ్ఞుఁడని పేరుపొందినదితఁడు కాడని నిర్ణయింపఁబడినది. ఇతనితరువాత నితర పద్మనాయక వీరులు 1400 మొదలు 1450 వఱకును రాజ్యముచేసిరి. సింగమనాయని కుమారుఁడు కుమారాన్నపోతనాయఁడు ఇతనికి ముగ్గురు పుత్రులు ఇందు రెండవయాతఁడే పేరుపొందిన సింగన. పోతనకృతమనుకొనఁబడు భోగినీదండకమితనికే కృతియీయఁబడినది. ‘‘కుమారాన్నపోతావనీనాథసూనుః పోతమాంబాలసద్గర్భముక్తామణిః,, అని దానియందు కలదు. మనుజేశ్వరాధములకిచ్చుట కంగీకరింపని పోతన, ఒక కృతి నితని నానిపైఁ జెప్పియిచ్చుట విశ్వాసపాత్రముగ లేదు. వెలుగోటివారి వంశచరిత్రయు రావువంశీయుల చారిత్రము నీతని పాండిత్యమును గవిజనాద

రణమును కీర్తించుచున్నవి. వీరికి సర్వజ్ఞనామధేయము పౌరుషనామమని బొబ్బిలిసంస్థానాధిపతుల చరిత్రయందు లిఖయింపఁబడియున్నది. ఇతఁడు రాజమహేంద్రవరమును పాలించెనని ప్రతీతికాని, ఇది చరిత్రవిరుద్ధము. ఈకాలమున మహామ్మదీయులును గజపతులును రాజమహేంద్రవరము కొఱకు తగవులాడుచుండిరి. ఈసింగన యోరుగంటిరాజ్యమును పాలించెను. ఇతనిని పోతనగూర్చిన కొన్నిగాథలు ప్రచారముననున్నవి ఇతనిని శ్రీనాథకవి పొగడినాఁడు. సింగమనీనిఁగూర్చిన గాథలెన్నో కలవు. సింగమనాయఁడను పేరు కలవారెందరోకలరు. ఏయేగాథ లెవరివో చెప్పుటకష్టము భాగవత మీకాలముననె రచియింపఁబడియుండెనని కొందఱి యభిప్రాయము. రేచర్లప్రభువులకు సమకాలికులగు రెడ్డచరిత్రయు సుప్రసిద్ధమయినట్టిదె. 1325 నుండి 1380 వఱకును రాజమహేంద్రవరప్రాంతములను గోరుకొండరెడ్లు పాలించిరి. వీరు మొదట శైవులయ్యు తరువాత వైష్ణవమతావలంబులైరి. ఇందుఘనుఁడు వేమారెడ్డి. ఇతఁడు కవులను పండితులను పోషించెను. నాచన సోముఁడు తిప్పన మున్నగువారితని సమకాలికులు. అనపోత భూపాలునికాలమున సముద్రవ్యాపారమువిస్తరిల్లెను. ఇతనితరువాతఅనవేముఁడును, కుమారగిరి. భూపాలుఁడును, పెదకోమటి వేమభూపాలుఁడును పరిపాలించిరి. మామిడి సింగనామాత్యవరుఁడీకాలమున చాల యశము

గడించెను. ఇతనికాలముననె శ్రీనాథుఁడు విద్యాధికారియు నభినవభట్ట బాణబిరుదాంకితుఁడగు వామనభట్టు ఆస్థానకవిగనుండిరి. ఈపెదకోమటి వేమభూపాలుని సమకాలికుఁడును శ్రీనాథునిచే పొగడొందినవాఁడును, సర్వజ్ఞ బిరుదాంకితుఁడు నగు రావు సింగమహీపాలుఁడెవఁడో తెలియ లేదు. అటు తరునాత 1424 వఱకును రాచ వేమారెడ్డియు నతనితరువాత మల్లారెడ్డియు నతనివంశజులును రాజ్యమునేలిరి.

కొండవీటిసీమను పాలించినదేసటి అనపోతభూపాలుని మేనల్లుఁడగు కాటయవేమునిచరిత్ర చాలప్రఖ్యాతిఁజెందినది. ఇతఁడు 1386మొదలు 1400వరకును పరిపాలించెను. రెండవ హరిహరరాయలు తన కొమారితని తనికొమరునకిచ్చి పెండ్లి చేసెను ఇతని విద్యాపరిశ్రమయును, దానధర్మములును, శాసనములు చాటుచున్నవి. ఇతని తరువాత అల్లాడభూపతి రాజ్యమేలెను. ఇతఁడు పెదకోమటి వేమభూపాలు నెదిర్చి రాజమహేంద్రవరమును గాపాడుకొనెను. కర్ణాటక రాజుల తోడను గజపతులతోడను సఖ్యము చేసికొనెను. ఇతఁడు వీరభద్రారెడ్డికి పట్టముగట్టి పోయెను. వేమభూపతులు శైవులు. చాల ధర్మములను చేసిరి. వీరభద్రుని విభవమును శ్రీనాథుడు బాగుగ ననుభవించినాఁడు. మనవేమన యీ కాలపువాఁడే కాఁబోలు.

అట కర్ణాటాంధ్రదేశమున నూత్న సామ్రాజ్యము దిన దిన ప్రవర్థమానమగు చుండెను. 1336 మొదలు 1355 వఱకును ప్రథమ హరిహరరాయలు పరిపాలించెను. తరువాత నితని తమ్ముడు వీరబుక్క భూపతి రాజ్యమేలెను. నాచన సోమన, ఇతనివలన, కడపమండలమున నున్న బుక్కపట్టనము దానముగ గొనినట్లు తెలియుచున్నది. ఇతని కొమరుడు రెండవ హరిహరరాయలు. ఇతడు 1377 మొదలు 1404 వఱకును పరిపాలించెను. ఈ కాలములోనె మన బమ్మెర పోతరాజు పుట్టెనని కొందఱి యభిప్రాయము. తరువాత రాజ్యమునకువచ్చినవాఁడు ప్రథమ దేవరాయలు. ఇతఁడు 1422 వఱకు పాలించెను. విక్రమార్క చారిత్రముగ రచించిన జక్కన యిక్కాలపువాఁడె. తరువాత 1423 మొదలు 1447 వఱకును ప్రౌఢదేవరాయలు రాజ్యము నేలెను. ఈతని కాలమందె పోతన తనభాగవతము నొంటిమెట్టలో రచించెననియు పైకక్షివారి యభిప్రాయము. ఈరాజులెల్లరును ప్రసిద్ధులు. ధర్మానురక్తులు పండితులను పోషించిరి. దేశమును సుభిక్షముగ పరిపాలించిరి. పగతుర నెదిర్చిరి. రాజ్యముసువృద్ధిచేసిరి. అందువలననె తక్కిన చోటులనుండి పలువురిచ్చటికి వచ్చి నెలకొనిరి.

సాంఘికస్థితి.

ఈకాలపుప్రభువులుపూర్వాచారములనుపాటించుచుండిరి. వీరికాలమున నియోగులు రాజోద్యోగములందుండిరి. వీరే

మంత్రులుగానుండిరి. సింగనామాత్యుఁడు సుప్రసిద్ధుఁడు. దేనటివేముని మంత్రి రామాప్రెగ్గడ. అల్లాడభూపతి మంత్రి లింగన. వీరెల్లరు చాల తెలివికలవారు. ధర్మపరతులు. వేమభూపాలుఁడు చాల పరాక్రమవంతుఁడు. ఈరాజులెల్లరు వైదికమతమును వర్ణాశ్రమ ధర్మములనుద్ధరించి పౌరాణిక విగ్రహారాధనము, శాస్త్రవిద్యలు ప్రోత్సహించి వివిధ ప్రతిష్ఠాపనములు కావించి దానధర్మములుచేసిరి. వీరి పాలనాక్రమమును బాగుగవర్ణించినవాఁడు శంభుదాసుఁడు. వేమభూపాలుండితని వలన కృతులందినాఁడు. కృష్ణాతీరమున వేమవరము నితఁడు బ్రాహ్మణుల కగ్రహారముగనిచ్చెను, చెఱువులు భావులు త్రవ్వించి జనులకుపకారముచేసెను. ఈకాలమున నగ్రహార బ్రాహ్మణులు దర్పలుంచెడు వ్రేళ్లను రవ్వలయుంగరములను, గంధాక్షతలుంచుచోట కస్తూరి తిలకములను, జన్నిదములదగ్గర ముత్యాల సరులును ధరించి సౌఖ్యములందనేర్చిరని శ్రీనాథుఁడు చెప్పుచున్నాఁడు.

మహమ్మదీయులతోడి పోరులవలన దోపిడులు సంక్షోభమును కలుగుచున్నను మొత్తముమీద ఆంధ్రనాయకుల పరిపాలనమున జనులకు సుఖముగనె యుండెను. వాణిజ్య వ్యవసాయములను బాగుగ నారసికొనుచుండిరి. అవచి దేవయసెట్టి యనుకోమటి, వేమభూపాలునకుఁ బ్రాపుగ

నుండెను. ఇతని కాలమున వర్తక వ్యాపారములకు మార్గము లేర్పడెను. ఇతఁడు పూర్వపద్ధతుల ననుసరించియె సుంకము లను రాఁబట్టుకొనుచుండెను. రైతుల యుపయోగార్థము ధన నిధుల నేర్పరచెను. అనపోత భూపాలుని కాలమున నొక గొప్ప సంగతి జరిగెను. పూర్వము కాకతీయుల కాలమునఁ జాలప్రాముఖ్యము నొంది వర్తకస్థానమై నౌకావ్యాపారము నకు ముఖ్యపట్టణమైయుండి తరువాత క్షీణించి నశించిన మోటుపల్లినితఁడు మఱల నుద్ధరించెను. అనేకములగు సదు పాయములను కల్పించి, మఱల వర్తకులను ప్రోత్సహించెను, అచ్చట నెలకొనువారికి నివేశనములిచ్చెను. కొన్ని వస్తువుల పైన సుంకములను తీసివేసెను. ద్వీపాంతర వ్యాపారమును ప్రోత్సహించుటె యతని అభిప్రాయమని శాసనము నుడు వుచున్నది.

వేమభూపాలునికి ప్రాపుగనుండిన యవచి దేవయ సెట్టి కు టుంబమువారు సముద్రయానము సేయుటయందును, విదేశ వ్యాపారములు చేయుటయందును ప్రఖ్యాతిఁగాంచిరి. తిప్ప యసెట్టి తమ్ముఁడైన చామియసెట్టి సముద్రయానముచేసి, నానాద్వీపాంతరములుపోయి, కర్పూరపాదపములు, బంగరు మొలకలు, సంకుమద్రవములు, ఆణిముత్యములు, చీనిచీ నాంబరములు, గంధసింధురములు, తేజీహారులు మున్నగు

వాని నాంధ్రదేశమునకుఁ దెచ్చినటుల శ్రీనాథుని హరవి లాసము నుడువుచున్నది.

అట, విజయనగర సామ్రాజ్యమునకూడ వాణిజ్య వ్యవసాయములు బాగుగ సాగుచుండెను. ఆనగర విభవమును గూర్చి సౌధములను, బాజారులను, వ్యాపారములను, రాజుల వైభవమును, ప్రజల అభివృద్ధినిగూర్చియు, 1420 లో "నికోలోకోంటి"యను నిటలీదేశపువాఁడును, 1443లో హీరతుదేశపు అబ్దుల్ రజాకును. బాగుగవర్ణించిరి. నగరమున కేడు ప్రాకారములుండెనట. విశాలములగు బాజారులుండెనట. జనులు చాల సుగుణులుగనుండిరట, దేశమునందు నగలు ధరింపని స్త్రీపురుషులు లేరట.

మతములు వానిస్థితి.

ఈకాలమున వీరశైవ మొకవంకను, వైష్ణవ మతమింకొక వంకనుండెను. శంకరుల వారి యద్వైతమును దేశమందు వ్యాపించెను. మనదేశమందు, అందుముఖ్యముగ నాంధ్రదేశమున వైష్ణవమునకును వీరశైవమునకును, ఘోరమగు కలహము జరుగుచుండెను, ఒకప్పుడొక మతము నింకొకప్పుడింకొక మతమును విజయముగొంచి రాజసన్మానము నొందుచుండెను. హొయిసలలను రామానుజులవారు వైష్ణవులుగ

చేసిరి చోళులెల్లరు వీరశైవులైరి. వీరు హొయిసలలను జయించినప్పుడు రామానుజులవారి మతము నారుమూలలకు పారిపోవలసివచ్చెను. ఇట్లుకొన్ని వందలయేండ్లు పోరాటము జరిగెను. మహమ్మదీయులతోడి యుద్ధములందు, ఈయంతఃకలహము కొంతతగ్గెనుగాని అంతరింపలేదు. సంఘసంస్కర్తలు మతాచార్యులు అనేకులు బయలుదేరి నూతన బోధలను చేయుచుండిరి. వేదాంతము ప్రబలెను. మనదక్షిణదేశమునందుండిన నవీనమతబోధకుఁడొకఁడుత్తర హిందూస్థానమున నేకేశ్వరారాధనమును, వర్ణముల యభేదమును బోధించి యనేకులను శిష్యులుగ చేసికొనెను. మహాపురుషుఁడగు కబీరు గురుఁడగు రామానందుఁడితఁడె. ఇతఁడుపదునాల్గవ శతాబ్దమువాఁడు. ఇట్టిసంస్కర్తలును, వేదాంతులును జ్ఞానులు నీకాలమున బలువు రూరూరఁ దిరుగుచుండిరి. అట్టివారిలో మనవేమన యోగి యొకఁడు.

రేచెర్లవారి వంశజులెల్లరును వీరశైవులు. అనపోతనాయఁడనేక భైరవ ప్రతిష్ఠాపనములు చేసెను. నిరంతర శివదేవతాపరాయణుఁడగుట నితని కాలమున వైష్ణవమతమునకు రాజసన్మానములేకుండెను. ఇతని తమ్ముఁడగు మాధవనాయకునుశైవుఁడె. ఇతఁడు శ్రీశైలమునకు మండప ప్రాకారాదులను గట్టించెను.

కొరుకొండ రెడ్లలో ముమ్మిడి నాయకుని పూర్వులు శైవులైనను, ఇతఁడు నితని తమ్ములును వైష్ణవులైరి. శ్రీరంగమునుండి యొక గురు వీతనికడకువచ్చెను. ఇతఁడు వైష్ణవమతమును గోదావరి మండలమున వ్యాపింపఁ జేసెను. ముమ్మిడినాయకుని అనంతరము మరికొన్ని ప్రతిష్ఠాపనములు జరిగెను. కైంకర్యాదులకొఱకు భూదానము లియఁబడెను. వీరికి కులగౌరవము మెండుగనుండెను. వైదిక మతాభిమానము చాలగనుండెను. దేసటి వంశపు రెడ్లకు శ్రౌత స్మార్త విద్యలయందలి యభిమానముమెండు. వీరు పౌరాణిక రాజుల నాదర్శముగ కొనిరి. వేమారెడ్డియునన వేమరెడ్డియు మాన్యము లనేకములిచ్చినట్లు శాసనములు నుడువుచున్నవి. పెదకోమటి వేముఁడును సనాతన ధర్మములను బ్రోత్సహించెను. కాటయవేముని శాసనములనేక శివక్షేత్రములలో కనఁబడుచున్నవి. భీమేశ్వరుఁడును మార్కండేయేశ్వరుఁడును వీరికిఁ గులదైవతములుగ కనబడుచున్నారు. అల్లాడ భూపతి కుటుంబమునకుఁ గులగురువు ఘోడేరాయ భీమేశ్వరుఁడు. ఇతఁడు శైవబ్రాహ్మణుఁడు. ఆరాధ్యుఁడు. వీరి కాలమున శివార్చనములు బాగుగ జరుగుచుండెను. నిర్మాల్య ధోవతులకు విభూతిపండ్లకు రుద్రాక్షమాలలకు కొదువలేదు. శ్రీనాథుని భీమేశ్వరపురాణ మీకాలపు మతస్థితిని బాగుగ చెప్పుచున్నది.

బెండపూడి అన్నామాత్యుఁడు ననేక శివాలయ ప్రతిష్ఠాపనములు చేసెను.

ఇఁక కర్ణాటాంధ్రమున, విజయనగర సామ్రాజ్యమున మతస్థితియు నించుమించుగ నిట్లేయుండెను. శైవమతమును వైష్ణవమతమును ప్రధానముగనుండెను. రాయలవారలెల్ల మతములయందును సమానాదరణమును చూపుచుండిరి. రెండవ హరిహరరాయలెల్ల మతములను బాగుగ నాదరించినను తాను మాత్రము శివవిరూపాక్షు నుపాసించుచుండెనట. విగ్రహారాధనములు నుత్సవములును విరివిగ జరుగుచుండెను. దేవరాయల కాలమున వర్ణములవారిలో వామదక్షిణ తెగలను కక్షలు బయలుదేరెను కాని అవి తీవ్రముగ లేవు. బ్రాహ్మణులును జైనులునుగూడ సుఖముగనుండిరి. ఇట్లు వివిధ మతములు విజృంభించినను మొత్తముమీద పండితులును కవులును సద్బ్రాహ్మణులును జాలవఱకు శంకరుల వారి వేదాంతమును గ్రహించి యద్వైతసిద్ధాంతమును తమకు తోచినట్లు జనసామాన్యమునకు బోధించుచుండిరని ఆకాలపు వాఙ్మయమువలన తెలిసికొనఁగలము

వాఙ్మయము.

పదునాల్గు పదునైదవ శతాబ్దములు ప్రపంచచారిత్రమునఁజాల ప్రసిద్ధిచెందిన శతాబ్దములు. మధ్యయుగాంతముగ, నూతనశక ప్రారంభయుగముగ నీ శతాబ్దములు పరిగణిం

పంబడు చున్నవి. పాశ్చాత్య నాగరకతయందు పరివర్తనలు కలిగెను. క్రైస్తవ మత సంస్కరణ శాఖ ప్రబలెను. లోకమున జాతీయతాభిమానము ప్రజ్వరిల్లెను. నూతన అభిప్రాయములు ఉద్భవించెను. పాశ్చాత్య విశ్వవిద్యాలయములు, ఇటలీ, జర్మనీ, ప్రాన్సు, ఇంగ్లాండులలో మతాచారుల ప్రోత్సాహములచే వర్ధిల్లెను. మెల్లమెల్లన నావికులు క్రొత్తదేశములను కనుగొనుచుండిరి. గ్రీసుదేశపు వాఙ్మయమును నూతనదృష్టితో ప్రజలభ్యసింపసాగిరి. ఇటలీలో ఈనూతనోద్యమము ప్రారంభమయ్యెను. దీనినిబట్టియే కళలపై నభిమానము అంకుముఖ్యముగ శిల్పముపైన, చిత్రలేఖనముపై నభిరుచి మెండయ్యెను. పాశ్చాత్య నాగరికమున రాజకీయరంగమున నిరంకుశ పాలనము బోధించువారులు, నిరంకుశముగ పాలించువారులు బయలుదేరిరి. పదునైదవ శతాబ్దము తుదిని అమెరికా కనుగొనబడుటయు హిందూదేశమునకు దారి కనుగొనబడుటయు జరిగెను. దీనివలన నూతన నాగరికతలు తారసిల్లెను. నూతనాభిప్రాయములు ప్రజలయందు కలిగెను. ఈ నవయుగమునుగూర్చి ఘనులగు హాలము, లార్డ్జి బర్కార్టు గొప్పగా వర్ణించి వ్రాసియున్నారు.

ఇది ఆంధ్రవాఙ్మయ చరిత్రమునఁ బురాణయుగమని చెప్పవచ్చును. కవి సార్వభౌముఁడు పురాణములనెన్నో తెనిఁగించి

నాఁడు. పురాణకథలనె ప్రబంధములుగ వ్రాసినాఁడు. అయిన కృతులవలననే ఈ కాలమునాటి ఆంధ్రదేశచారిత్రము మనకు లభించుచున్నది. పోతనామాత్యుని ఆంధ్రభాగవతము తప్ప తక్కినకృతులెల్ల ఆకాలపురాజులకు, మంత్రులకు, అంకితములీయఁబడినవి. అందువలననే ఆకాలపు ఆంధ్రదేశపు రాజకీయస్థితి చక్కఁగ మనకు తెలియుచున్నది. అయినను తమ్మాదరించిన ప్రభువులనుగూర్చి ఆస్థానకవులు కఠినముగ వ్రాయురుకదా? శ్రీనాథుఁడు వైరివీరులను గుఱించి వ్రాసినపట్లను పోతన్నగారు రాక్షస నాయకులను వర్ణించి చెప్పినపట్లను, వేమన్నగారి పద్యములందును, ఆకాలపు రాజుల స్వభావము, రుచులు, యుద్ధములు, పరిపాలనము, తెలిసికొనఁగలుగుచున్నాము. శ్రీనాథుని రాజమహేంద్రపుర వర్ణనము, ఆంధ్రదేశమును గూర్చిన ప్రశంస, పలనాటిని గూర్చిన వర్ణనము, కొండవీటిపుర వర్ణనము, అగ్రహార బ్రాహ్మణుల వర్ణనమును మనకు మనదేశ చారిత్రము కన్నులకుఁ గట్టినటుల చూపుచున్నవి. ఫిరోజిషానుగూర్చి మనము చదువు చాటు పద్యములు, మల్కిభ రామునిగూర్చిన చాటువులు ఇతర కవులు వ్రాసిన చాటువులును సాంఘికమత స్థితులనుగూర్చి యెంతో బాగుగ తెల్పుచున్నవి. ఆంధ్రదేశమున సర్కారులను కొనబడు కృష్ణా, గోదావరీ ప్రాంతములు పశ్చిమాంధ్ర మనబడు నూత్న కర్ణాటాంధ్రదేశమునను, స్థితిగతులెట్లుండెనో తెలిసి

కొనుట శ్రీనాథుఁడు, వేమన, పోతన, ఎఱ్ఱా ప్రగ్గడ నాచన సోముఁడును మనవాఙ్మయమునందు ప్రకాశించునంతకాలము కష్టములేదు. ఇప్పుడిప్పుడు కనుగొనబడుచున్న శాసనములెల్ల మనకవుల చరిత్రరచనలు నిజములేయని తెలుపుచున్నవి. ఇంచుక అతిశయోక్తి తీసివైచినచో శేషము చరిత్రముగ నిర్ధారణము కావించుకొని, పైకృతులను బరిశీలించుట ముఖ్యము. వాఙ్మయనిర్మాతలనుబట్టి దేశముయొక్క నాగరికతను నిర్ణయింపవచ్చును. శ్రీనాథునిగన్న ఆంధ్రదేశము, శ్రీనాథుని రచనలఁజదివిగొన్న ఆంధ్రలోకము—శ్రీనాథుని గౌరవించిన రాజులు, పోతరాజునిగన్న ఆంధ్రభూమి, పోతరాజు రచనల నలరిన ఆంధ్రులు, వేమనవంటి సంస్కర్త పుట్టినదేశము, ఇట్టి ఔన్నత్యము పొందిన ఆంధ్ర నాగరికత యెంతటి వైభవముగనుండెనో గ్రహింపలేమా? అనంతామాత్యుడు, జగ్గన, నందిమల్లన, ఘంటసింగయ, కర్ణాటాంధ్ర సామ్రాజ్య వైభవమును వర్ణించిన కవులు. కృష్ణదేవరాయని అష్టదిగ్గజముల యుగమునకు ముందుండినవారు.

ఆంధ్రదేశపు నాగరికత యీకాలమున కృష్ణా, గోదావరుల నంటియుండెను. పదునైదవ శతాబ్దము గడచినకొలదిని శ్రీనాథుని విభవమువలెనే అదియు నశించెను. పోతరాజుగారి మాట నిజములయ్యెను. వేమన్నగారి నీతులును నిజముల

య్యెను రాజులు ధనమదాంధులైరి. ప్రజలు సుఖాసక్తులైరి సంసారసాగరమున మునిగిరి. కస్తూరి హేమపాత్రాన్నము పోయినవి. దినవెచ్చమై దొరకుట దుర్లభమయ్యెను. దురదృష్టము శ్రీనాథునకే కాదు—ఆంధ్రదేశమునకే వచ్చినది! దారిద్ర్యము వచ్చినది. రాజమహేంద్రవరపు రెడ్డిరాజ్యమునకు గజపతులు విరోధులు. వీరికి కర్ణాటకులును శత్రువులు. పశ్చిమమున బహామనీరాజ్యము విజృంభించుచుండెను. వీరికిని కర్ణాట చక్రవర్తులకును యుద్ధములు గలిగెను. యవన కర్ణాట కటక భూధవులు సమానబలులు. అందువలన సమరములు భయంకరములయ్యెను. ఇట్టిస్థితిలో రెడ్డిరాజ్యము నిలువ లేకపోయెను. ఇట్లుండగ గజపతుల రాజధాని యగు కటకమున 1434 లో విప్లవము కూడ కలిగెను. కపిలేంద్ర గజపతి రాజమహేంద్ర నాశనము గోరి దానిపై దండెత్తెను. ఈకల్లోలములలో—దురదృష్టములో—నాంధ్రసామ్రాజ్యలక్ష్మి నిలువలేక మెల్లమెల్లన గౌతమీకృష్ణవేణులపైఁ కెగఁబ్రాకి, నూత్న కర్ణాటాంధ్ర సామ్రాజ్యమున దలదాచుకొని యా భూపతుల యాదరణమున, గవుల సాహాయ్యమున, ప్రజల గారామున నవశక్తితో ప్రపంచమునందలి నవయుగారంభపు మెఱుంగులనదగు కళకాంతులతో, మహమ్మదీయ పోర్చుగీసు నాగరికతల సమ్మేళనముతో పేయసు మున్నగువారు వర్ణించిన విజయనగర వైభవమునఁ బొల్గొసనది. శ్రీకృష్ణ

దేవరాయని మహోన్నతి ననుభవింపఁ గలిగి, కీర్తిని దిగంత
ముల వ్యాపింపఁ జేయగలిగినది.

ఈ రాజకీయసాంఘికమత స్థితులకు, ఆకాలపు వాఙ్మయ
మున జాల నిదర్శనములు కలవు. పోతనామాత్యుని కృతి
యందును నిదర్శనములనేకములు కనబడుచున్నవి. మతమును
గూర్చిన జిజ్ఞాస, ఆచారవ్యవహారములనుగూర్చిన అభిప్రా
యములు, రాజులనుగూర్చిన విమర్శనమును, పోతన, అచ్చట
చ్చట వెల్లడించినాఁడు. సమయోచితముగ నాయాతావుల
యందు సూచించినాఁడు.

పోతన తన వంశావళి నొక పద్యమునఁ జెప్పికొనినాఁడు.
అమాత్యుఁడనుట నియోగియని తేలుచున్నది. అయినను
ద్యోగము నపేక్షింపక హాలముదున్నుకొనిన మహాత్యాగి
యితఁడు. ఇతఁడు కౌండిన్యగోత్రుఁడు. ఆపస్తంభసూత్రుఁడు.
తండ్రి కేసన. తల్లి లక్కమాంబ. వీరిమతము శైవమని తెలి
యుచున్నది. అయినను వీరికద్వైతమునందభిమానము మెండు.
పోతన భాగవతమునం దెట్లు పలుకుచున్నాఁడు.

"చేతులారంగ శివుని బూజింపఁడేని, నోరునొవ్వంగ హరికీర్తి నుడువఁడేని
దయయు సత్యంబులోనుగా దలపఁడేని కలుగనేటికి తల్లుల కడుపుచేటు"

పోతన భాగవతమును రచియించిన పరమభాగవతోత్తముఁడ
య్యు శివుని దూషింపఁడు. ఇతనికి హరిహరులందు సమాన

మగు భక్తికలదు. ఇతఁడు తనకాలమునందుండిన మతవైష మ్యమును చూచినాఁడు. ఇది యితనికి సమంజసముగ తోఁచ లేదు. అందువలన నభేదభావమును బోధించినాఁడు. భక్తి చేతనె భగవంతుని సాధింపుమన్నాఁడు సర్వాంతర్యామియు సర్వేశ్వరుఁడు నొక్కఁడేయని ఇతఁడు నమ్మినటుల "ఎవ్వని చేఁ జనించుజగమెవ్వనిలోపలనుండు లీనమై" యని వ్రాసిన సుప్రసిద్ధపద్యమె తెలుపుచున్నది. ఇతఁడు బాలభక్తుఁడగు ప్రహ్లాదునిచే మనకు భక్తియోగమును బోధించినాఁడు. సర్వేశ్వరుఁడెందెందు వెదకిచూచిననందే కలఁడని నొక్కిచెప్పించినాఁడు. అందు శైవ వైష్ణవమతములకు కలిగినవిరోధము ను బాగుగ ప్రదర్శించినాడు. అయినను శంకరమతమె లెస్స యనుటకో యన "మోహనిర్మూలముచేసి యెవ్వనియందు తత్పరులయినయెఱుకగల పురుషులకుం బరులుతామనియెడు మాయాకృతంబయిన యసద్గ్రాహ్యంబగు భేదంబుగానంబడ దట్టి పరమేశ్వరునకు నమస్కరించెదనని ప్రహ్లాదునిచేత పలికించినాడు.

దుఃఖమునందు మునిగినఆర్తులకు, ఒక్కొకప్పుడు "కలఁడు కలండనెడువాఁడుకలఁడో లేఁడో!" యను అనుమానమునుగలు గుచుండును. నిర్హేతుకజాయమాన కరుణగల ప్రేమమయుఁడు తనభక్తులను బ్రోచునని, గజేంద్రమోక్షమున చెప్పినాడు.

పోతన, తనకాలమునాటి సంఘదురాచారములను చూచినాఁడు. ఐహికసుఖములందు నిమగ్నులై సంసారసాగరమున మునుగుచు తేలుచున్నవారిగతి యెట్టులాయని వితర్కించినాడు. భగవన్నామామృతమె దీనికిమందని గ్రహించెను. "తాపత్రయాభీల దావాగ్ని" ఇది లేనిచో నారదు. దుఃఖములునశింపవు. మోక్షముచేకూరదు. దారిద్ర్యముపోదు. పోతనతనచుట్టునున్న దారిద్ర్యదుఃఖములను, అన్యాయములను, అసత్యములను చూచినాఁడు, కుచేలునికన్న దుఃఖమనుభవించిన వాఁడెవఁడు? ఈఘోర ప్రపంచమునుండి వెలువడుట కొకటే మార్గమని అదిభక్తియోగమని భాగవతమున బోధించినాఁడు. ఈఅభిప్రాయముల నాయాఘట్టములలో నొక్కిచెప్పినాడు. ఇతఁడుభగవంతుని గుణములను స్మరించుచు నొక్కొకయెడ భక్తిలోలీనమైపోయినాఁడు. ఇతనిభక్తినిగూర్చిన గాథలనేకములున్నవి. ఇతనికాచార వ్యవహారములందు గుఱియెక్కుడని యితని పలుకులవలన తెలిసికొనఁగలము.

పోతనకు దగ్గరచుట్టములు, స్నేహితులు, సమకాలికులనేకులు ప్రభుత్వోద్యోగములందు సుఖముగనుండిరి. కవులు ప్రభువులకుఁ గృతులిచ్చి ధనముఁగడించిరి. పండితులు రాజులనాశ్రయించిరి. పోతనయిది చూచినాఁడు కాని యైహికసుఖేచ్ఛయితనికిలేదు. స్వతంత్రజీవనమే యితనికిష్టము. హాలికుఁ

డుఁగ నేయుండుట దీనికన్న గౌరవమని తలచెను. ఇదియునుగాక ఇతనికాలపురాజులు, నాయకులును, ధనవంతులును, మదాంధులై తమయిచ్చవచ్చినట్లు చరించుచుండిరి. ఒండొరులతో పోరాడుచుండిరి. ప్రజలను ప్రోచి సుఖపెట్టుటకుబదులు దోచి శ్రమపెట్టుచుండిరి. ఒండొరుల గొంతుకలఁ గోసికొనుచు భగవంతుని శాంతికి భంగముకలిగించుచుండిరి. వీరుదుర్యోధనాదులనుపోలినట్లితనికిఁగనపడిరి. అందువలన నెట్టి "మనుజేశ్వరాధములకు" కృతినిచ్చుటయు వారివలనకొన్ని సొమ్ములుపుచ్చుకొనుటయు నరకమునబడుటకే కారణమగునని యిత డూహించెను. వీరికికావ్య కన్యకనిచ్చి ధనముఁగొంటపశువు కూడుభుజింపుట. వీరినాశ్రయించి కవిత చెప్పుట భారతిని కర్ణాట కిరాట కీచకులకమ్ముట. పోతన యభిప్రాయములు సూచించుటకొఱకు కొన్ని పద్యము లుదాహరణలుగ చూడవచ్చును.

సీ॥ "కమనీయ భూమిభాగంబులు లేకున్నవే
పడియుండుటకు దూదిపఱుపు లేల?
సహజంబులగు కరాంజలులు లేకున్నవే
భోజనభాజన పుంజమేల?
వల్కలాజినావళులు లేకున్నవే
కట్టదుకూల సంఘంబు లేల?
గొనకొని వసియింప గుహలు లేకున్నవే
ప్రాసాద సౌధాది పటలమేల?

ఫలరసాదులు గురియవే పాదపములు
స్వాదుజలముల నుండవే సకల నదులు
పొసఁగ భిక్షము వెట్టరే పుణ్యసతులు
ధనమదాంధుల కొలువేల తాపసులకు'' ॥

అని శుకుఁడు పలికినట్లు వ్రాసినాఁడు. మఱియు నింకననేకచోటుల రాజుల కొలువుల నుంట నిరసించినాడు. అయినను మంచి భూపతుల పాలనమితడు నిరసింపఁడు. అరాజకముఁ గోరఁడు. అరాజకమువలన వచ్చుకీడుల నితఁడెఱుఁగును. శమీకమహాముని పరీక్షిత్తును శపించిన కుమారుని జూచి యెట్లు పలుకుచున్నాఁడో చూడుఁడు.

సీ॥ ''పాపంబు నీచేత బ్రాపించె మనకింక రాజు నశించిన రాజ్యమందు
బలవంతుఁడగువాఁడు బలహీను పశుదారహయముల వస్త్రాదుల నపహరించు
జారచోరాదులు సంచరింతురు ప్రజకన్యోన్య కలహంబు లతిశయిల్లు
వైదికంబైయున్న వర్ణాశ్రమాచార ధర్మమించుకలేక తప్పిపోవు
వంతమీఁద లోకులర్థకామంబుల దగిలి సంచరింప ధరణియెల్ల
వర్ణసంకరములు వచ్చును మర్కటసారమేయ కులము మేర బుత్ర'' ॥

అయిననేమి; పోతన కాలపురాజులు ప్రజలను పోషించుచున్నారా? తామొండొరులతో సఖ్యముగ నున్నారా? వారు కంసరాజువలె

''తల్లిదండ్రులనైన దమ్ములనన్నల సఖులనైన బంధుజనులనైన
రాజ్యకాంక్షఁజేసి రాజులు చంపుదు రవనిఁ దఱుచు జీవితార్థులగుచు''

దుష్టశిక్షణము శిష్టరక్షణమును మొదలె లేదు. వీరుధనమ దాంధులై క్రిందుమీదుఁ గానక మెలగుచుండిరి. వీరిని కొలుచుట గౌరవ హీనము.

క॥ "రక్షకులు లేనివారల రక్షించెదననుచుఁ జక్రి గాచియుండఁగ
రక్షింపుమనుచు నొకనరు నక్షముఁ బ్రార్థింపనేల నాత్మజ్ఞులకున్" ॥

వీరిమైశ్వర్యమును నాగరికయు నితనికి రోఁతగనుండెను. ఈ రాజుల పరిపాలనా క్రమముగూర్చిన విమర్శనము, వీరి గుణ వర్ణనమును, కంస, జరాసంధ, శిశుపాలురనుగూర్చి వర్ణించిన ఘట్టములందు సహజముగనుండునట్టులు చేసినాడు.

భాగవతకృతి విమర్శనము.

భాగవతము పదునెనిమిది పురాణములలో నొకటి. నీతిబోధకమై, భగవంతునిగూర్చిన కథలతో అనేకములగు నుపాఖ్యానములతో రసవంతముగ సంస్కృతమున రచియింపబడినది. దీనిని పోతన తెనుఁగుచేసినాఁడు దీని నాంధ్రీకరించుటకుఁగల కారణము పోతన తన భాగవతమందిట్లు వ్రాసినాఁడు. "మదీయ పూర్వజన్మ సహస్రసంచిత తపఃఫలంబున శ్రీమన్నారాయణకథా ప్రపంచవిరచనా కుతూహలుండనై, యొక్కరాకానిశాకాలంబున సోమోపరాగంబు రాకఁగనుంగొని, సజ్జనానుమతంబున నభ్రంకషశుభ్రసముత్తుంగ భంగయగు గంగకుఁజని క్రుంకులిడి, వెడలి, మహనీయమంజుల

పులినప్రదేశంబున మహేశ్వరధ్యానంబు చేయుచుఁ గించిదున్మీలితలోచనుండనై యున్నయెడ రామభద్రుండు తన నామాంకితంబుగా శ్రీమహాభాగవతంబు తెనుఁగుసేయ నానతిచ్చి తిరోహితుండయ్యె. మఱియు.

"మ॥ ఒనరన్ నన్నయ తిక్కనాది కవులీయుర్విం బురాణావళుల్
తెనుఁగుల్సేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో
తెనుఁగుంజేయరు మున్ను భాగవతమున్ దీనిం దెనింగించి నా
జననంబున్ సఫలంబుఁ జేసెదఁ బునర్జన్మంబు లేకుండఁగన్॥"

అని పలికినాఁడు. భాగవత పురాణమును పోతనయిట్లు ప్రశంసించుచున్నాఁడు,

"మ॥ లలితస్కంధము కృష్ణమూలము శుకాలాపాభిరామంబు మం
జులతాశోభితమున్ సువర్ణసుమనస్సుజ్ఞేయమున్ సుందరో
జ్జ్వలవృత్తంబు మహాఫలంబు విమలవ్యాసాలవాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరువుర్విన్ సద్ద్విజశ్రేయమై॥"

ఈ గ్రంథము నితఁడు పండితులు మెచ్చుకొనునట్లు తెనిఁగించినాఁడు. సంస్కృతమును నీళ్లకు నీళ్లు ప్రసాదమునకు ప్రసాదముగనుగాక, రసవంతముగ ననువాదముచేసినాడు. అందలి విశేషములను విపులముగ విప్పిచెప్పినాడు. మఱియు విష్ణుపురాణ హరివంశముల లోని కొన్ని కథాంశములనుకూడ చేర్చి కథా చమత్కృతికి వన్నెపెట్టినాడు. భక్తియు జ్ఞానమును

కష్టమగు విషయములుగాన బామరులకు బాగుగ తెలియునట్లు బోధించినాడు.

కథాచమత్కృతి

భాగవతమునకథాచమత్కృతి బాగుగనున్నది. ఇందువక్త శుకయోగి. ఇతడు జీవన్ముక్తుడు. ఇందలి శ్రోత పరీక్షిన్న రేంద్రుడు. అతడు హరిభక్తుడు. ఇందలి విషయమన్ననో ఏడుదినములలో ముక్తి నిచ్చు భక్తియోగమును బోధించు భాగవతకథ. శ్రీకృష్ణుడుత్తరా గర్భమును రక్షించుటయు పరీక్షిత్తు చరిత్రియు శమీకమునిపైన సర్పము వేయుటయు మునికుమారుని శాపమును, శుకయోగీంద్రుని రాకయు భాగవతపురాణము ప్రారంభమగును నారాయణుని లీలావతారవర్ణనము మూలకథాభాగము. ఇందు దృవోపాఖ్యానము, అజామిళోపాఖ్యానము, గజేంద్రమోక్షము, ప్రహ్లాద చారిత్రము, మున్నగు నుపాఖ్యానములు రసవంతములుగనున్నవి. శ్రీరామ చరిత్రియు కృష్ణలీలలును వానితత్వమును మనోహరముగఁజెప్పఁబడినవి. రుక్మిణీకల్యాణమును మనయాంధ్రకన్యక లెల్లరు చదువుచున్నారు. శ్రీకృష్ణుని చరిత్రలో వీరరసమొలుకు జరాసంధవధయు, నరకాసురవధయు నద్భుతముగవర్ణింపఁ బడినవి. సుభద్రాపరిణయము చాలరమణీయము. శ్రీకృష్ణబలరాములు వైకుంఠమునకరుగుటయు, మార్కండేయోపాఖ్యాన

ముతో సమాప్తమగును. ఇదియును మా కాలమునందు జనులు మన్న కథామంజరివలె, ఆఖ్యాయికాసమూహమువలె, రసవంతముగనున్నది.

పాత్రపోషణము: శ్రీకృష్ణుఁడు.

ఆధునికవచన రచనలందును, పాశ్చాత్య వాఙ్మయములందు నున్నటు లుండకపోయినను, మన యాధ్యాత్మికదృక్పథానుసారముగ మన పురాణములందును పాత్రపోషణముకలదు. పాత్రపోషణమనగా గుణప్రదర్శనమును, సత్యవిజయమును ప్రదర్శించుటయె మన యాదర్శములుగనున్నవి. భాగవతమందు శ్రీకృష్ణుఁడె ప్రధాన పాత్రము. అయినను శ్రీకృష్ణుఁడు మానవమాత్రుఁడు కాఁడు. ఇతఁడు శ్రీమన్నారాయణావతారము. భగవద్గీతలలో చెప్పఁబడిన సాధుపరిత్రాణము కొఱకు, దుష్కృత వినాశముకొఱకు, ధర్మసంస్థాపనార్థము లోకమునందవతరించిన శ్రీమహావిష్ణుఁడితఁడు. ఈ రెండుసంగతులును గుణములును భాగవతమున బాగుగ ప్రదర్శింపఁబడినవి. మానవగుణములు నవతారమహాత్మ్యమును బాగుగ పోషింపబడినవి.

కేవలము యోగిసిద్ధులుకూడ చేయఁగలకార్యములను మాత్రమె శ్రీకృష్ణుఁడు చేసియూరకొనలేదు. ఇతఁడొక పూ

ర్ణావతారము. ఇతఁడు బాల్యముననే చేసిన రాక్షసవధలిది స్థాపింపఁజాలవు. అనేకులిట్టిది చేసిరి. కృష్ణుఁడు కావించిన దావాగ్ని త్రాగుట, గోవర్ధనోద్ధరణము మృతులఁ బ్రదికించుటయు నితరులుచేసినట్లు పురాణములు నుడువుచున్నవి కాని, ఇతఁడు శంఖచక్రగదా హస్తుఁడై చతుర్భుజుఁడై జన్మించుట, యశోదకు గర్భంబున బ్రహ్మాండంబుఁజూపుట, నలకూబరమణిగ్రీవుల శాపముక్తులనుచేయుట, అక్రూరునకు నిజస్వరూపంబుచూపుట, పూతనా మోక్షము, శిశుపాలదంతవక్త్రవధ, దేవకీ వసుదేవుల వరప్రాప్తి, ముచుకుందవరదత్తము, బాణాసుర యుద్ధంబున శివపరాభూతి, విశ్వరూపసందర్శనములు నితర యమానుషకృత్యములుగ వర్ణింపఁబడినవి. శ్రీకృష్ణ గుణవర్ణనము చాల మనోహరముగ చేయఁబడినది లీలామానుషవేషధారియగు విష్ణువు మనుష్యలోకమున నవతరించి, లోకసంగ్రహార్థము మనుష్యచర్యల నత్యద్భుతముగ జరిపినాఁడు.

పుత్రధర్మము.

పాపము, దేవకీదేవియు వసుదేవుఁడును గృష్ణుని గాంచినారేకాని అతని ముద్దుముచ్చటలు చూడ నోచుకొనరైరి. ఆభాగ్యము యశోదానందులకుఁ గలిగెను. నిజముగ యశోదకు తన్ను విడిచి యొకక్షణమైనను పనిచేసి కొనుటకు కృష్ణుఁ

డవకాశ మీయలేదు. ఏదో పిల్లచేష్టచేసి యామెనాకర్షించును. కృష్ణాయని కాలమయినఁ బిలువకుండగ నుండలేదు. కృష్ణుని గట్టనుఁ దిట్టను కృష్ణుని నేరములు విచారింపను యశోదకు కాలముసరిపోవుచుండెను. పండువంటి బిడ్డఁడు తల్లిదండ్రుల కెంతసంతోషము కలిగింప సాధ్యమో అంత సంతోషమును బాలకృష్ణుఁడు యశోదానందులకు కలిగించినాఁడు తరువాత దేవకీవసుదేవులను సంతోషపెట్టినాఁడు. పోతన, ఈపుత్రధర్మమును ముద్దులొలుకు మాటలతో మనోహరముగ వర్ణించినాఁడు.

శిష్యధర్మము.

బ్రహ్మచర్యాశ్రమము స్వీకరించినవేళ కృష్ణుఁడు గురువులయొద్ద యెంతభయభక్తులతో నటించెనో ఎట్లు తనగొప్పదనము దాఁచి వినయవిధేయతలతో గురువునకు గురుభార్యకును శుశ్రూష చేసెనో, తుదకుఁ కౌపీనమాత్రధారియై యడవికిఁబోయి, కట్టెలుకొట్టి మోపుకట్టి, నెత్తిపైన బెట్టుకొని గాలి వానలో తడియుచు, శ్రమించియు నించుకంతయైన మనసున నొచ్చుకొనక విద్యలునేర్చి, తుదకు వారుకోరిన గురుదక్షిణలిచ్చి స్నాతకుఁడై వచ్చెనో, కుచేలోపాఖ్యానము వలనఁ దెలియుచున్నది.

మిత్రనర్మము.

శ్రీకృష్ణుఁడును గుచేలుఁడును సహాధ్యాయులు. కృష్ణుఁడు సమస్త భోగములందుచున్నప్పుడు గర్భదారిద్ర్యమునందున్న కుచేలుఁడు పోవఁ దనదు మృదుతల్పముననె యతనిఁ గూర్చుండఁ బెట్టి, "మురసంహారుఁడు కుచేలునికరముఁ గరంబున దెమల్చి కడక న్మనమా గురుగృహంబున వర్తించిన చరితములని కొన్ని నుడివి," చిన్ననాటి యాటపాటలను గూర్చి ముచ్చటించి, అతఁడు తెచ్చిన యడుకులను ప్రేమతోఁ దిని అతనిని సత్కరించి పంపెను.

శ్రీకృష్ణుఁడు పాండవులకు నెయ్యుఁడు. బందుగుఁడు. అన్నిటికిని దాసుఁడై వారి నారసికొనుచుండెను. వారికి సచివుఁడుగ ప్రాణముగ నుండెను. వారిని గట్టెక్కించినాఁడు. ఇఁక అర్జునునకు నితనికిని దేహములు రెండుగాని ప్రాణ మొకటె. వీరి స్నేహతత్త్వమును గూర్చి విమర్శగ్రంథములు వ్రాయవచ్చును. ధర్మరాజుతో అర్జునుఁడు పలికిన పలుకులివి.

సీ॥ "చెలికాఁడ రమ్మంచు-చీరు నొక్కొక వేళ మన్నించు నొక వేళ మఱఁది యనుచు
బంధుభావంబునఁ బాటించు నొక వేళ, దాతయై యొక వేళ ధనములిచ్చు
మంత్రియై యొక వేళ మంత్రమాదేశించు బోధయై యొక వేళ బుద్ధిసెప్పు
సారథ్య మొనరించు జనువిచ్చి యొక వేళ గ్రీడించు నొక వేళ గేలిసేయు
నొక్కశయ్యాసనంబున నుండు గన్నతండ్రి కైవడిఁ జేసినతప్పు గాచు
హస్తములు వట్టి పొత్తున నారగించు మనుజవల్లభ మాధవుఁ డుపరాదు."

క॥ "మనసారథి మనసచివుఁడు మనవియ్యము మనసఖుండు మనబాంధవుఁడున్
మనగురుఁడు మనదు దేవర మనలను దిగనాడి చనియె మనుజాధీశా॥"

గార్హస్థ్యధర్మము సహితము శ్రీకృష్ణుఁడు బాగుగఁ జరిపినాఁడు, తనభార్యలవిషయమున, బంధువులపట్ల, అతిథి యభ్యాగతులపట్ల నితఁడు బాగుగ ప్రవర్తించెను.

ఇతఁడాత్మజనరక్షణార్థమును, ధర్మసంరక్షణార్థమును, పెక్కురవధించెను గాని కామక్రోధాదులు కారణములుగ నట్లుచేసినవాఁడు కాఁడు. ముందుగ విరోధికిహితబోధచేసి లాభములేక, అవశ్యకర్తవ్యమగుటనట్లు చేయుచువచ్చెను. ఆయన లీలలకెల్ల నంతరార్థముకలదు. అవిపైకి యెట్లుకనబడినను వాస్తవముగ నిష్కామకర్మయోగమును ప్రదర్శించుచున్నవని పెద్దలందురు.

శ్రీకృష్ణుఁడు ప్రేమమయుఁడు. అతనినిచూచి కొందఱు, మాటలువిని కొందఱు, స్పర్శమువలన కొందఱును పరవశులగుచుండిరి. అతనిమూర్తి మనోహరమైనది. ఆత్మదివ్యమయినది. అయనయందొక దివ్యతేజముండి యెల్లరనాకర్షించివైచుచుండెను. అతనిని చూచి స్త్రీలేకాదు, నారదాదులును పరవశులైరి. అతఁడు బాల్యమునచేసిన దుడుకుతనమున కెవ్వరు నతనిని గొట్టలేకపోయిరి. గోపికలకెల్లర కతనియందనురాగము కలిగెను. ఒకనాడాతని మురళీగానము వారలనాకర్షిం

చెను. వారువచ్చిరి. అతఁడెన్నో బుద్ధులు చెప్పెనుగాని లాభము లేకపోయెను. వారు పరవశులైరి. అంతరాసక్రీడ జరిగినది. శ్రీకృష్ణుని క్రీడలను వర్ణించునప్పుడు వ్యాసులవారు వ్రాసిన భాగవతమునలేని కొన్ని శృంగారచేష్టలను పోతన వర్ణించినాఁడు. భక్తిపారవశ్యమున నేమరుచున్నాఁడో యెఱుఁగకయో, ఎఱిఁగియు భగవంతునిగూర్చి యేమిచెప్పినను దోషములేదని తలంచియో, ఈపరమ భాగవతోత్తముఁడు, కృష్ణుఁడు గోపికలను చౌశీతిబంధములం దనిపెనెను. రాసక్రీడనాటికి శ్రీకృష్ణుఁడెనిమిది తొమ్మిదేండ్ల బాలుఁడు! ఇట్టితరి చౌశీతిబంధములు శృంగారచేష్టలునేమి? ఇది కేవలము మాయాలీల. సమ్మోహనము. ఈలీలలెల్ల విచిత్రములు. తామరలోని నీటిబిందువు పగిది నిష్కామకర్మను ప్రదర్శించుచున్నవి.

అట్లు శ్రీకృష్ణుని గుణపోషణము రసవంతముగ పోతన తెనుఁగుచేసినాఁడు. మానవచర్యలెంతో ప్రకృతిస్వభావోచితముగ తగినమాటలతో చెప్పుచు, నవతారమాహాత్మ్యమును విపులముగ వర్ణించి చెప్పినాఁడు. ఇఁక భాగవతమునఁగల తక్కిన పాత్రములసంగతియేమి? ఇందు వేనవేలు పాత్రములున్నవి. ప్రధానములగునవియు వందలకొలఁదికలవు. వానిని గూర్చి తెలుపుటకొక గ్రంథముకావలెను. భాగవతమునే కరువుపెట్టుటయగును. ప్రహ్లాదుఁడు, ధ్రువుఁడు, మున్నగు బాల

భక్తుల గుణవర్ణనము, జీవితప్రదర్శనము నెంతో బాగుగ చేసినాఁడు. వారిమాటలు, చేష్టలు, చాల గంభీరముగనుండును. స్త్రీపాత్రములనుగూడ జాగ్రత్తగ తనసహజకవితాశోభతో పోషించినాఁడు. బాలికయగు రుక్మిణిని మనభారతీయకన్యకలలో శిరోమణిగ, ఆదర్శముగచేసినాఁడు. ఆబొమ్మపెండ్లిండ్లు, గుజ్జనగూళ్ళు, ముద్దుముచ్చటలును, గుణపోషణమున ప్రతిమానములు. చిన్నపాత్రములని పోతన నిరసించివదలఁడు. కాళీయుని భార్యలు, లీలావతి, గోపికలు నెంత బాగుగ చిత్రింపబడినారో చూడుడు. పోతనకృతియందు స్త్రీపాత్రములనుగూర్చిన విశేష మొకటికలదు. సత్యభామాయుద్ధాంకము భాగవతమూలగ్రంథమున లేదు. ఆఘట్టమును కన్నులకుఁ గట్టినటుల పోతన చిత్రించినాఁడు. సత్యభామచర్య యద్భుతము. ఈఘట్టమునే నాచన సోముఁడు తన యుత్తరహరివంశమున వర్ణించినాఁడు. గుణగ్రహణపారీణులగు పండితులు నీరెంట నేది బాగుగనున్నదని నిర్ణయించుటకింకను తగవులాడుచున్నారు. పాత్రపోషణమునుగూర్చిన విశేషములింక నెన్నో కలవు.

శిల్పచాతురి.

పోతన్నగారు తనకవితచిత్రికళాప్రదర్శనమును పరమేశ్వరునివలన దయచేయఁబడిన వరమనినమ్మినాఁడు. ఆయనది సహ

జపాండిత్యము. ఆయన ఆంధ్రభాగవతము నందలిపద్యములె ల్లమనోహరశిల్పమున కుదాహరణములుగనున్నవి. భాగవత మునందలి కథాభాగములు, ఘట్టములు, చదివినను వినినను రసవంతములుగనుండి కన్నులకుఁ గట్టినట్టులుండును, అందలి పాత్రములు సహజముగనుండి మనజీవితముల కాదర్శప్రాయములుగనున్నవి. జీవానుకరణము భావానుకరణము పోతన శిల్పమున గానవచ్చుచున్నవి.

గజేంద్రమోక్షమున భక్తుని మొఱవిని శ్రీకృష్ణుఁడు చెందిన తొందర, ఆపదవచ్చినవానికి సాహాయ్యము చేయఁ బోవువాని సహజమైనతొందర. ఆయన వెంటపోవు పరివారము పోతన చక్కఁగ చిత్రించినాడు. శ్రీకృష్ణుని మోహినీస్వరూపము, మనోహరచిత్రలేఖనము. దానివలన రాక్షసులందు కలిగిన చిత్తభ్రమ మద్భుతమైనను సహజమె. శ్రీకృష్ణుని చిత్తరువులను పోతన లేఖిని చాల చోటుల వ్రాసినది. శిశువుగ, బాలుఁడుగ, యువకుఁడుగ, వీరుఁడుగ, భగవంతుఁడుగ ననేకచోటుల కృష్ణుఁడు మనకు కనబడును. రుక్మిణిదేవి బాలికగ యువతిగ లక్ష్మీదేవిగ మనకన్నులయెదుటకనబడును.

ఆంధ్ర భాగవతమున ప్రకృతిసౌందర్య ప్రదర్శనము, స్వభావసామ్య నిరూపణమును చక్కఁగ నున్నవి. అందలి

సూర్యాస్తమయ చంద్రోదయ వర్ణనములు ఋతువర్ణనము లద్భుతములు. శరదాత్రిని శ్రీకృష్ణుని మురళి గోపికల నాకర్షించిన విధముగనె పోతన కవిత మనల నాకర్షించును. అచ్చటి వర్ణనలు, సంబోధనలు, పద్యములు, రసవంతములై భావగీతులుగ నున్నవి.

మహాపురాణములందు భారతమునందుకల, తపోవన వర్ణనములకు భాగవతములోని వర్ణనములు తీసిపోవు. ఇందలి కణ్వాశ్రమ వర్ణన లలితముగ నున్నది. ఇందలి శరదృతు వర్ణనము మనోహరము. రాసక్రీడ యొక చిత్రశిల్పము.

పోతన్నగారు స్వభావసామ్యము నెంతో చక్కగ ప్రదర్శించెను. భక్తిని శృంగారముతు కలిపి చెప్పిన చోటుల నిది కానవచ్చుచున్నది. ఇతరచోటులను బాగుగనె కనబడుచున్నది. ఉదాహరణమునకు రుక్మిణీ కల్యాణమున

"దేవకీసుతుకోర్కె తీగలువీడంగ వెలదికి మైత్రీగ వీడఁదొడగ
గమలనాభుని చిత్తకమలంబు వికసింపఁ గాంతికి ముఖకమలమొప్పె"

అను పద్యమును చూడుడు.

భాగవతమున రసపోషణము.

ఎట్లున్నది? ఈప్రశ్న వేయుటె సాహసకృత్యము. చెఱుకు నందు రసమెట్లున్నదని అడిగినట్లున్నది. భాగవతము నవరస ములొలుకుచుండును. అయిననిందు ప్రధానములగు రసములు

రెండు. మొదటిది శాంతి అనగా భక్తిరసము. రెండవది శృంగారరసము. ఈ రెండిటిని వేఱువేఱుగ చిలికించి కవిత చెప్పినవారనేకు లాంధ్రమునం గలరు; కాని ఈ రెంటిని మంచిపాకమునగలిపి, ఆంధ్రలోకమునకుం గొత్తరుచిని చూపినది పోతన హరిభక్తిని. మంచిపాకమున వేసిన పోతనశక్తి యద్భుతము. ఈకవి యేమిపలికినను, సహజముగ మొలచినట్లుండును. ఇతడు మంచి మృదుమధురభాషలో రసములొప్పునట్లు వర్ణించును. ఏసమయమునకుం దగినమాటలా సమయమునఁ బలుకును. హాస్యరసము మనభాషలో తక్కువయని పలుకువారికిం గడు పుబ్బనవ్వు పుట్టింప శ్రీకృష్ణుని బాల్యక్రీడను చదివి వినిపింపవచ్చును. కేవలశృంగారమె కావలెనను రసికులున్నచో అష్టమస్కంధమున మోహిన్యావతారఘట్టమును, దశమస్కంధమున గోపికాలీలలును చూపింపవచ్చును. వీరరౌద్రరసములు నృసింహావతారమున బాగుగ ప్రదర్శింపబడినవి. భీభత్సభయానకరసములు యుద్ధములందు బాగుగనొప్పినవి. దీనికుదాహరణమునకు స్థాలీపులాకన్యాయమునకైన చూపెదమన్న గ్రంథవిస్తరభీతిని విరమింప వలసివచ్చెను.

కవితావిశేషములు

భాగవతమున చాలకలవు. ఇది మహాపురాణమైనను మహాప్రబంధలక్షణములగు,

“పురసింధున గర్జ్వనశీశసరసేవన మధురతి ప్రసంగ విరహాముల్
పరిణి యతనహో దయనయావిరచన యాత్రిజ ద్యూతవిభు’,

వర్ణనములు చిత్రస్థలములలోఁ కలవు. ఇవిచాల మనోహరముగ వర్ణింపబడినవి. కవిత్వతత్త్వవిచారము పెద్దలు చేయవలెనుగాని చిన్నవ్యాసకారులు చేయఁదలచుట వెఱ్ఱితనని. పోతన సహజకవిత మొత్తముమీద శాస్త్రానుసారముగనే యున్నదని పండితులయభిప్రాయము. ఇతఁడనేకవిధములగు నలంకారములను, శబ్దాలంకారములను ప్రయోగించినాఁడు. ఇతఁడంత్యప్రాస నియమమునువిచ్చలవిడిగవాడినాడు. ఇతనికవితలో శ్రవణసుఖమున్నది. ఈతనిసంగీత మాధురీమహిమను పురాణముల చదివినవారును వినినవారు నెఱుఁగఁగలరు. ఈకవి వివిధములగు శ్లేషలను వెదజల్లినాడు. రసమొలుకురచనలను కురిపించినాడు

మొదటనె పోతన వివిధరుచులుకలవారిని సంతోషపఱచెదనని

“కొందఱికిఁ దెనుఁగుగుణమగుఁ
గొందఱికిని సంస్కృతంబు గుణమగు రెండుం
గొందఱికి గుణములగు నే
నందఱ మెప్పింతుఁ గృతులనయ్యైయెడలన్’’

అనిపలికి, ఆ ప్రతిజ్ఞను నెఱవేర్చికొనినాఁడు. పదలాలిత్యము అన్వయసౌలభ్యము, చిత్రాలంకారములు, నుభయభాషాప్రౌఢిమయు నితని కవనమును మనోహరముగ చేసినవి.

అయినను నితని కవితలో కొన్ని దోషములున్నవని కొంద అనిరి. ఉభయరేఫ సాంకర్యదోషమున్నదని అప్పకవి యని నాడు. ఇదిదోషమని ఇప్పుడెవ్వరుననరు. ఆంధ్రమునిట్లు చెప్పువారు పలువురున్నారు. ఇదిద్దైనను పోతనవ్రాసిన భాగవతములో లేదు. భాగవతము శిథిలమైనప్పుడు పూరించినకవుల కవనమునందె, ఈదోషము నితరదోషములు దొరలినవికాని పోతన కవితయందు తప్పులులేవని కొందఱు పలికిరి.

పోతన కృతములనుకొనబడునవి.

ఇతరపుస్తకములు కొన్నికలవు. వీనినెవరు రచించిరో చెప్పుటకష్టము. ఇందు మొదటిది వీరభద్రవిజయము. ఇది నాల్గాశ్వాసముల శైవప్రబంధము. ఇందు పోతనపేరేలేదు. ఒకవంశావళికిల ప్రతినిచూచి కీర్తిశేషులగు వీరేశలింగము పంతులవారు భ్రమపడి మొదటనిది పోతనకృతమెయనినను, తమ యవసానకాలముకుముందుగ వ్రాసిన వ్యాసమున నిది పొరపాటని గ్రహించి సవరించికొనిరి. ఆంధ్రులచరిత్ర వ్రాసిన వీరభద్రరావుగారు నిది పోతనది కాదని నారు.

రెండవది భోగినీదండకము. దీనినిగూర్చియు నిరుతెగల వారు పోరాడిరి. ఇందు పోతనరచించెననుకొనబడు పద్యము తుట్టతుదను కలదు.

"పండితకీర్తనీయుడగు బమ్మెరపోతనయాఖ్యుఁ డాంశుమా
ర్తాండకులాచలాంబునిధి తారకమైఁ యిలసిల్లభోగినీ దండకమున్
రచించె బహుదానవిహర్తకు రావు సింగభూమండల
భర్తకున్విమత మానవనాథ మదాపహర్తకున్,,

ఈదండకము కుమారాన్నపోతావనీనాథనూనుఁడగు సింగన వేశ్యను పొగడుచు, నతనికిఁగృతియీయఁబడినది! "ఇమ్మనుజేశ్వరాధముల" నితిట్టుచు భాగవతమునుగృతినీయనొల్లని ఆత్మగౌరవముకల పోతన ఇట్లుచేసెనా? చేయునా? ఇదియునుగాక, ఈపద్యమైనను, దండకము చివర, "నాచంద్రతారార్కమై యొప్పఁతఁ" అని ముగిసినతరువాత నొకతోఁకవలె తగిలింపఁబడినది. కవనము పోతనదివలె నుండునట్లు తెలివితేటలు కలకవియెవ్వఁడైన నీదండకమును వ్రాసియుండవచ్చును. ఇట్టిదండకములెన్నో పూర్వమునుండి నశించినట్లు తెలియుచున్నది. ఇట్టి దండకమును పోతనపైఁ బగదీర్చికొనుటకు సింగనయె రచియింపించి యుండెనేమో యనికూడ కొందఱియభిప్రాయము.

భోగినీదండకము పోతనదికాదనినవారిలో నొకరగు వాఙ్మయచరిత్రకారులె పోతన ఇంకొకకృతిని వ్రాసినాఁడనినారు. ఇది నారాయణ శతకము. ఇందలిపద్యము లాంధ్రదేశమున ప్రచారములోనున్నవి. కాని వీనికర్త యెవ్వఁడో తెలి

యదు. కవిత్వము దోషభూయిష్టముగనున్నది. ఈ శతకపు వ్రాత ప్రతియొకదాని యందిటీవల వ్రాయబడిన గద్యను చూచి ఇది పోతనదనుకొని యుందురని కొందఱియభిప్రాయము.

ఇట్టి సందేహాస్పదములగు కృతులను విమర్శింపకయే, విడిచినచో మంచిదని తోచుచున్నది. ఈతళుకు బెళుకురాళ్లు లేకనె పోతనదివ్యరత్నము పురాణములలో పురాణమై మహా కావ్యములలో మహాకావ్యమై, ఆంధ్రవాఙ్మయమున ప్రకాశించుచున్నది.

వేమన కృతి విమర్శనము.

అంధ్రమున నీతి మతబోధకమగు శతక వాఙ్మయము మెండుగనున్నది. కవులు తమయిష్టదైవములను సంబోధించుచు నొక్కొక్క పద్యశతకమును చెప్పుచుండిరి. తత్త్వజ్ఞానమును బోధించు శతకములుకూడ కొన్నికలవు. మఱియు మానవులకుగల లోపములను పేర్కొని చూపుచు, దుర్గుణములను దూషించుచు, హాస్యరసప్రధానములై నీతిదాయకములగు శతకములును కలవు. కుక్కుటేశ్వరశతకాదులు పేరునకు దైవమును సంబోధించుచున్నను, ఆకాలమునాటి రాజకీయ సాంఘిక మతస్థితులను గూర్చి విమర్శించి, ఆచా

రవ్యవహారముల దుస్థితియెన్నటికిఁ దీరునా యని పలుపించు చున్నవి. వివిధ విషయములను, పరిస్థితులు, పరబూతులు, కలిపివిమర్శించి హాస్యరస ప్రధానముగ రచియింపబడిన శతకము,కవిచౌడప్ప శతకము ఇంకొన్ని చోటుల చాల మోటుగ నుండును. మన వేమనపద్యములట్టి వివిధశతకములు కొన్ని కలిపిన సముద్రాయము వలెనుండును. ఇవికొన్ని వేలకుమించినవి. హాస్యరసప్రధానములై, ఆచారవ్యవహారములను ఖండించి నీతిమతజ్ఞానములును తత్వమును బోధించుచున్నవి.

వేమనకూడ తనకాలము నాటిస్థితిగతులను బాగుగ వెల్లడించినాఁడు. ఇతనికాలములో రాజకీయస్థితి బాగుగ లేనట్లు లితనిపద్యములె తెలుపుచున్నవి. "ఒకరినోరుగొట్టి యొకరుబత్కింతురు" "ధనమెచ్చిన మదమెచ్చును" అనినాఁడు. "రాజవరులకెల్ల రణరంగములచింత" యని పిరోండారులతో పోరుచుండుటను విమర్శించినాడు. అయిన నితఁడు అరాజకము నపేక్షింపఁడు. నృపతిలేక భూమితృప్తికాదట. ధర్మమే నృపులకుదారకంబని పలుకుచు, "అధికుఁడైన రాజు అల్పునిచేపట్ట వానిమాట చెల్లువసుధలోన" అని యేయమాత్యవరునో తిట్టుచున్నాడు. ఇతఁడు దుర్మార్గపరిపాలకుల నెట్లుహెచ్చరించుచున్నాఁడో చూడుడు:

"వెక్కజనులఁజంపి పేదలవధియించి డొక్క కోఁకనూళ్లుదొంగిలించి
ఏడదాగియున్న యెఱిగి యముడు చంపు ॥విశ్వ॥"

రాజు తుంటరియైనచో నతనికొలువును ప్రజలు నెట్లుండునో సూచించుచున్నాడు.

“ప్రభువు కోతియైన ప్రెగ్గడల్ పందులు సైనికులందు పక్కి సేనవసులు
ఏన్గులశ్వచయము తెలుకలు పిల్లులు ॥విశ్వ॥”

ఈపద్యమువెల్ల నెట్టి రాజకీయ స్థితిలో వ్రాయఁబడెనో కదా! ఇఁక సంఘముయొక్క ఆచారవ్యవహారములనుగూర్చి వేమన యేమనుచున్నాఁడో పరికింతము. ఇతఁడు సంఘదురాచారములను కఠినముగ విమర్శించుచున్నాడు. వర్ణాశ్రమధర్మములన్న నితనికిఁ గిట్టదు.

“అజ్ఞానమె శూద్రత్వము సుజ్ఞానము బ్రహ్మమౌట శ్రుతులను వినరా
అజ్ఞానముడిగి వాల్మీకి సుజ్ఞానపు బ్రహ్మమొందె తెలియర వేమా,,

“జాతులందు మిగులజాతి యేదెక్కువో ఎఱుకలేక తిరుగ నేమిఫలమని యడుగుచు “కులములేనివాఁడు కలిమిచే వెలయును, కలిమిలేనివాని కులముడుగు” నని పలుకుచున్నాడు.

ఇతఁడస్పృశ్యతా దోషమును తీవ్రముగ ఖండించినాడు. ఇతఁడు యోగియగుట సర్వజనులును సమానులేయని పలికినాఁడు:

“మాలవాని నేల మఱిమఱి నిందింప నొడలురక్తమాంస మొకటికాదె
వానిలోన మెలగు వానికులం బేది ॥వి॥,,

ఇతఁడు ప్రథమశాఖవారిని, వైశ్యులను, నంబివారిని, కంసలివారినికూడ తిట్టినాడు! ధనమూలమిదం జగత్తనులోకోక్తిని తఁడిట్లు చెప్పుచున్నాడు.

“ధనమెమూలము జగతికి ధనమెమూలంబు సర్వధర్మంబులకున్”,

అని “పరగలేమిచేత బందువుల్ పగవారలయినారని వగచుచున్నాడు. ఇట్టి యుదాహరణముల నితఁడెన్నిటినిచూపించినాఁడో కదా!

“కాపుబిడ్డయున్న గరణానికదిబట్ట కరణముబలమెల్ల కాపుబట్ట
కాపుసంతసంబు కరణముసంతోషమఖిలమూడ లోకమందువేమ॥

అని రెండర్థములతో నొకచోట పలికినాడు. ఇట్టివి పెక్కులు కలవు. ఇతనికి స్త్రీలన్న నభిమానము లేదు. “భార్యలుపోషించినన్నాళ్లు భూషించి తరువాత దూషింతు” రట. స్త్రీలను నమ్మరాదట. ఇతఁడు సంసారమును రోయుచున్నాడు.

“మానవునికి పూజకన్న బుద్ధినిధానము. మాటకన్న మనసుదృఢము. కులముకన్న గుణమెప్రధానమని మాదిగవానికిగుణమున్నచో ద్విజుఁడగునని పలికినాడు. అయిన నింకొకచోట నితఁడు.

“తిరుపతికిపోయిన తురకదాసరికాడు కాశికిపోయినను లంజ
మంచిదికాదు గోదావరికిపోయినను కుక్క-సింహము కానేర”,

దని పలికినాడు. ఇట్టివిరుద్ధపుఁబలుకులు పెక్కు గలుకలవు. పాపపుణ్యములు మనసునుబట్టి యుండునని చెప్పి, దైవము చెడ్డవానిఁ జెఱచుననుచున్నాడు. ఇంకొకచోట దైవము మనల బొమ్మలనాడించినట్లు లాడించుచున్నాడనుచున్నాడు. ఇతఁడు వ్యభిచారమును తీవ్రముగ ఖండించి జారులను జారిణులను తిట్టినాడు. మనసు పవిత్రముగనుంచుకొనుట ముఖ్యమనియు, కాంతా కనకములమీఁది యాసవిడిచినగాని ఎన్ని తీర్థయాత్రలుచేసినను లాభములేదని నొక్కి పలుకుచున్నాడు.

వేమన మొదట వీరశైవుఁడని పద్యములవలననె తెలియుచున్నది. అయిన నితఁడు పరమవేదాంతి యైపోయి, జ్ఞానియై, తత్త్వజిజ్ఞాసచేసి, ఒక్కొకప్పుడు నాస్తికునివలెకూడ మాటలాడును. వివిధమతముల నధిక్షేపించుచు పరతత్త్వమును గొలుచుచుండెను. మతాచార వ్యవహారములనెల్ల దూషించినాడు, శైవమును వైష్ణవమునుగూడ సమానముగ ఖండించినాడు. ఇతఁడు విగ్రహారాధనమును నిరసించుచున్నాడు ఇతని తత్త్వము చిత్రమైనది. మొదట శివునిఁబూర్చి భజించి, ఏకేశ్వరోపాసనముచేసి, తత్త్వజ్ఞానమున నాత్మారాధనము లోనికిఁ దిగినాడు. ఇతఁడు కృత్యాదినె ఇట్లుపలికినాడు:

"శివకవులకు నవకవులకు శివభక్తికిఁ దత్త్వమునకుఁ జింతామణికిన్
శివలోకప్రముఖులకును శివునకు గురువునకు శరణు సేయర వేమా,,

జ్ఞానము గాజుకుప్పెలోని దీపమువంటిదట. ఆత్మశుద్ధిలేని ఆచార మితనికనిష్టము. నమశ్శివాయని నారాయణాయని పలుకుదురే కాని దానధర్మములు చేయరని వగచుచు, జపమును బాహ్యపూజయు చేసియు, జనులు కపటము విడువలేక ముక్తినొందఁజాలకున్నారనియు, తత్వమెఱిగినవారికిఁ జింతయె లేదనియు నితఁడు పలుకుచున్నాఁడు.

ఇతఁడు గురువు గురువని పొగడి వర్ణించి. తుదకు "గురువనగ పరమాత్ముఁడు శిష్యుఁడనగ బటుజీవుఁడని" తెలియఁజెప్పినాడు. తానెవ్వరు తనవారెవ్వరు చావనగనేమి? ఎల్లయు మిథ్యయని మాయావాదము సేయుచున్నాఁడు. మతమును గూర్చిన, ఇతని ముఖ్యాభిప్రాయమీ పద్యమునఁ జూడనగును.

"ఏకబ్రహ్మము నిత్యము వైకల్పికమైనయట్టి వస్తువులెల్లన్
ఏకత్వంబు నెఱింగిన లోకము లేకల్ల ముక్తిసులభము వేమా,,

వైష్ణవులనుగూర్చి యితఁడిట్లనినాఁడు:

"వైష్ణవులను వట్టిమాటయె కాని ప్రజల జెఱతురయ్య వాస్తవముగను,,

అయినను శైవుల నితఁడు మన్నించలేదు:

"శివునిభక్తులెల్ల భువిమంటిపాపులైరి, పాదమేల దైవభావమేఁ?
విష్ణుభక్తులెల్ల వెలిబూఁడపాపులైరి ॥వి॥

ఇంకొకచోట నితఁడు సర్వమతములకు దేవుం డొకఁడేయని

"శైవవైష్ణవాదిషణ్మతంబులకెల్ల దేవుఁడొక్కఁడనుచుఁ దెలియలేరు
తనువు భేదమయిన తత్త్వంబు భేదమా ॥వి॥"

ఇతఁడు దొంగవేషములు వేయువారిని గూర్చి యిట్లు పలికినాఁడు "బారెడేసిజడలు భస్మంపుబూతలు మరునితోడ మారు మలయగలరు" అని యింకొకచోట "తలలుబోడులైన తలపులు బోడులా" యని కపటసన్యాసుల దిట్టుచున్నాఁడు. విగ్రహారాధనమితని కనిష్టము.

"శిలలఁజూచి నరులు శివుఁడని మెత్తురు శిలలు శిలలుగాని
శివుఁడు కాఁడు, తనదు లోని శివుని తానేల తెలియఁడో ॥వి॥"

అని ఆత్మశివలింగపూజ చేయుమని హెచ్చరించినాఁడు.

ఇతని కాచార వ్యవహారములందు. కర్మానుష్ఠానమునందు నమ్మకము లేదు.

"వ్రతములెన్నియైన వట్టిచిక్కులె కాని ఆత్మచిక్కుగాన నలవికాదు.
ఆత్మచిక్కు బాపువతఁడె పోఘనయోగి ॥వి॥"
"ప్రేతయన్నమనుచు ప్రీతితో పిలిపించి కాకులకును బెట్టుకర్మ
లార కాకులందునేమి ఘనులకుఁ బెట్టుఁడీ ॥వి॥

ఇతనికి దెంతయసహ్యమో ఈపద్యమువలన తెలియుచున్నది.

"పిండములను చేసి పితరులఁదలపోసి కాకులకును బెట్టు
గాడ్దెలారఁ! పెంటఁదినెడు కాకి పితరు డెట్లాగయా ॥వి॥

ఈకాలపు సంఘసంస్కర్తలలో నెవ్వఁడిట్లన సాహసించును? ఇతనికితీర్థములందు నమ్మకమె లేదు.

"కాశికాశియనుచు కడుశ్రద్ధతోఁ బోదురందుగలుగు దేవుఁడిం
దులేడె ఇందునందుఁగలఁడు హృదయంబు తెల్పెన౹వి॥

వేమననీతులు,

ఆంధ్రదేశమున నలుగడల బాగుగ నెలకొనినవి. భాషయందు, మాటలలో, వ్రాతలలో, నివివిచ్చలవిడిగ నుపయోగింపఁ బడుచున్నవి. వేమనపద్యములు లౌకికన్యాయ బహుళములై, జనసామాన్యమున ప్రతిపురుషుని నోటను స్త్రీనోటను వినవచ్చుచుండును. సంస్కృతమున భర్తృహరిసుభాషితమువలె మనభాషలో నీనీతులు ప్రచారమునొందినవి. సాధారణగ నొకరైతుమాటలలో, గొల్లసుద్దులలో, వీధిభాగవతములలో, ప్రసిద్ధవాఙ్మయములలో, మధ్యమధ్య వేమననీతులు వినవచ్చుచుండును. మనముదినమున కొకమారైనను వేమననుస్మరింపకుండము. అతనినీతులువివిధములు. "నిక్కమైన మంచినీలమొక్కటిచాలు, అనువుగానిచోట నధికుల మనరాదు; కొంచెముండుటెల్లకొదువకాదు; నెలవుదప్పినచోట నేర్పరికొఱగాడు; కంచుమ్రోగునట్లు కనకంబుమ్రోగునా; నిజములాడువాని నిందించుజెగమెల్ల; మొదలుగాగలనీతులు వందలకొలది మనమువినుచున్నాము. ఇవిగాక సంపూర్ణప

ద్యములెన్నో వాడుకలోనున్నవి. ఉప్పుకప్పురంబు నొక్క పోలికనుండును పద్యము దినమున కెన్నిసారులు వినుచున్నామో! ఒకయూరనున్న నింకొకయూరిలో లేక, ఒకచోట నున్నట్టు లింకొకచోట లేక, ఎవరికితోచినట్లు వారుపలుకుచు, వివిధములగుమండల పదములతో వినవచ్చుచున్నవి. సామెతలవలె, లోకోక్తులవలె, నీతులవలె, ఉపమానముల వలె నీపద్యములనుపయోగించుచున్నారు. ఇంతటిజనాదరణమునకుఁ బాత్రుడైనకవి యింకొకఁడులేఁడనుట యతిశయోక్తి కానేరదు. ఒక్కడేసుపుత్రుడునిగన్న తండ్రిలాగున మనవేమన తనయొక్క కృతితోడనె కీర్తినిగడించినాడు.

వేమన హాస్యము.

వేమనకృతిలో రసపోషణము లేదని యెవ్వరుననరు. తక్కినరసము లెట్లున్నను హాస్యరసము ప్రధానముగనున్నది. ఇతఁడు మతమునుగురించి, బ్రాహ్మణులనుగూర్చి, ఆచార వ్యవహారములనుగూర్చి, చేసినహాస్యమద్భుతము. ఇతని హాస్యమొక్కొకప్పుడు మృదువుగనుండక శృతిమించుచుండును. కొంచెము మోటుగనుండును. అయిన నితనియెత్తిపొడుపులు వాడియగు బల్లెపుఁబోటులవలె నాటుకొనును. ఉదాహరణమునకుఁ గొన్ని పద్యములెత్తి చూపినఁజాలును.

"సమశ్రీవాయనవచ్చు నారాయణనవచ్చు, మేలువారినమ్మి మెచ్చవచ్చు
కొంగుపడచి కాసుగొబ్బుననీరాదు ॥వి॥ "

అని రెండవపాదమున తేలుకొండివంటి యెత్తిపొడుపునుంచినాడు. ఇట్టి ప్రతిపద్యమున:

"ఆలిమాటలు విని యన్నదమ్ములఁ బాసి వేఱుపడెడువాఁడు వెట్టివాఁడు
కుక్కతోఁకఁ బట్టి గోదావరీదునా? ॥వి॥"

"కోమటోఁడినిష్ఠ గురికి రాదెన్నఁడు లోభగుణముచేత లోనికడగు,"

"బారెఁడేసిజడలు భస్మంపుఁబూఁతలు మరునితోడమారు మలయఁగలరు
ముంజికోకలెల్ల లంజకోకలకాదె ॥వి॥"

"కుక్కలుపవనంబు కొక్కెరధ్యానంబు, యతులనోసట నొసఁగనట్లు
వ్రాసె తొల్లిచేసినట్టి దోషంబుతగిలెనో ॥వి॥"

"పిండములను చేసి పితరులఁదలపోసి కాకులకును పెట్టు గాడ్దెలార
పెంటదినెడు కాకి పితరుఁడెట్లాగయా ॥వి॥"

ఇతని కాచారవ్యవహారములందు గౌరవము లేకపోయినఁ బోవుఁగాక శ్రుతులందు స్మృతులందు పురాణములందు పవిత్ర వాఙ్మయమునందు వేయేల చదువునందైనను గౌరవముకలదా? ఆవంతయైన లేదు.

"చదువురానికన్న చాకలితా మేలు కులము వేల్పుకన్న కుక్క మేలు.
సర్వసురలకన్న సర్వేశ్వరుఁడు మేలు ॥వి॥"

"తన్ను దెలియకున్న తగ వేదములు వెట్టి సత్యసంపదకుము సాబు వెట్టి
శాస్త్రసంచయంబు సర్వపురాణముల్ జబ్బులనుట జగతిచాటు వేమ,"

ఇతడెంతటి ధైర్యశాలి! ఇంతతో సూరకుండక

"వెఱ్ఱినక్కలవలె వేదముల్చదివిన నాశయంబు తెలియఁగర యయ్యవారు. వేదసారమెల్ల వేమనయెఱుగునని చాటుచున్నాడు. ఇదిచాలక వేదవిద్యలెల్ల వేశ్యలవంటివనసాహసించినాడు.

ఇఁక మహాభారతమును మనముపూజించు పాండవులను మాత్రము మన్నించెనా? చూడుము ఎట్లునిందించెనో!

"తాతజనించెకన్యకకు, తండ్రులుతాము గుండగోళకుల్
మాతపరానుకూలి మఱిమక్కువ ద్రౌపదిభర్తలేవురున్
నీతులఁజెప్పుపాండవుల నీమములిట్టివి యంచునెంచుచున్
భూతలమందు మిక్కిలిగఁబూజలు చేసిరివెఱ్ఱివేమనా,,

వేమనజీవితచారిత్రమునకు

కొన్నినిదర్శనములు పద్యములలోనేకలవు. తనజన్మస్థానమునుగూర్చి, కులమునుగూర్చి, జీవితవిధానమునుగూర్చి యచ్చటచ్చట చెప్పికొనియున్నాడు. తనయూరినిగూర్చి

"ఊరుకొండవీడి కునికిపశ్చిమవీధి మూగచింతపల్లె మొదటియిల్లు
ఎడ్డిరెడ్డి కులమదేమని తెల్పుదు విశ్వ॥,,

అనిపలికెనేమోయని యనుమానింపవచ్చును. పాపమతఁడెన్నోయూళ్లు తిరిగెను.

'ఆమడకాపుడకడవులఁ గ్రిమ్మబులు చెఱువునదులు కర్మమువింతే
తామెందులోనఁదిరిగిన వేమనతోడగుచువచ్చు వెంటనె వేమా॥'

వివిధమాండలికపదములు దీనినె సూచించుచున్నవి.

వేమన్న తనకులమునుగూర్చి యిట్లు తెలుపుచున్నాడు.

"కలియుగమునను న్న కాపుకులానకు వేమనదనకీర్తి వికర్షియించె
నున్నధర్మమెల్ల నుర్వి పైనరులకు గోరఁబెట్టు వరము గోరి వేమ॥"

"బలకుభూమి నేరసెడువారును అవనిపతికి వశ్యులైనవారు
నగు కాపుకులమును పాలవంటికులముగ వచించుట కులాభి
మానమునుచూపుచున్నదని రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు
వ్రాసినారు. గుంటూరు నెల్లూరుదత్తమండలములలో కాపులు
రెడ్లు పర్యాయపదములుగ వాడుచున్నారు. ఇతడుచేసిన
"వేమనృపాలశేఖరా" యను సంబోధనమువలన నితడు ప్రభు
వంశములోని వాడాయని యనుమానము కలుగుచున్నది.
'పాకనాటి' రెడ్లకితడొకపద్యమున నగ్రస్థానమిచ్చుటచేతను,
ఇతని నిర్యాణప్రదేశమగు కటారుపల్లెవారు పాకనాటికాపు
లమని వ్యవహరించుకొనుచుండుటచేతను, ఇతఁడా శాఖకుఁజెం
దినట్లు తలంపవచ్చును. ఇట్లు పరిశీలించుచు పోయిన యెడల
వేమనయోగి జీవితచారిత్రము కొంతవఱకు తెలియనగును.

వేమన కాలమునాటి రాజకీయస్థితికివి కొన్నినిదర్శనములు
కలవు. అతడుపుట్టునప్పటికి కొండవీటిసీమను పెదకోమటి
వేమభూపాలుడు పాలించుచుండెనని కాలనిర్ణయమునఁదెలి
సికొనుచున్నాము, కర్ణాటకసామ్రాజ్యమునకు దేవరాయలు
(రెండవ హరిహరరాయల కొమరుడు) రాజు. రాచ వేమా

రెడ్డియనంతరము 1425వ సంవత్సరమునకు కొండవీడు పరుల పాలయ్యెను. 1435 నాటికి రాజమహేంద్రవర రాజ్యమును రెడ్డిరాజులు కోల్పోయిరి. మహాదాతలగు రెడ్ల దానధర్మములు, దేవాలయప్రతిష్ఠాపనములును వారిని రక్షింపలేదు, వేమన్న యిది చూచినాడు. ఇతనికి వైరాగ్యముకలిగినది. బ్రాహ్మణులు దుర్మార్గులై చెడిపోయినారని కోపమువచ్చినది. ఆకాలపు భైరవపూజలు, బలులు, చూచి అసహ్యపడినాడు. రాజకీయస్థితికి వగచినాడు.

"కాముకుఁడైనవాఁడు ధనకాంక్షవహించినవాఁడు మిక్కిలిన్
పామరుఁడైనవాఁడు భువిపాలనసేయనివాఁడు మూర్ఖుడున్
మోమరసేయువాఁడు మతిముక్తినిగాంచునె యెన్నిభంగులన్
వేమనవాక్యమొక్కటియు వీసరఁబోవునె దారిఁదప్పినన్॥"

రాజమహేంద్రవరమును పీడించిన గజపతులపైనితనికి కోపముకలుగుట సహజమె! గ్రద్దవంటివాఁడు గజపతికాఁడొకో యని యొకచోటను, గజపతింటనెన్నగవ్వలుచెల్లవా,, యని ఇంకొకచోటను పలికినాఁడు.

వేమనజీవితవిధానము,

నాశయములును అచ్చటచ్చటసూచించినాడు.

"ఊరివారికెల్లనొక్కకంచముపెట్టి పొత్తుగుడిపి కులము పొలయఁజేసి
తలనుచెయ్యిపెట్టి తగనమ్మచెప్పరా విశ్వ"

ఇది యితనియాశయము. తనజీవితవిధానమునుగూర్చి యితఁ డిట్లు పలికినాడు.

"కూటికి లేనివానివలెఁ గోవము లేకను నెల్లతావులన్
మాటికిమాటికిన్ మఱియు మాటకుమాటకుఁ బద్యపద్ధతిన్
ధాటి నెఱుంగఁ జెప్పుచును ధారుణిలో శివరూపధారియై
మాటికినున్న వేమన సమానము నెవ్వరు నుర్వి వేమనా॥"

ఇతడుసాధారణముగ మౌనముగనుండెడివాడు.

"పలుకమన్న నేలపలుకకయున్నావు, పలుకుమయ్య నాతో ప్రబల
ముగను పలుకుమయ్యనీదు పలుకు నేనెఱిఁగెద విశ్వ॥"

ఇట్లుండి తనకిష్టమో, అవసరమో కలిగినపుడెల్ల పద్యములను చెప్పుచుండెడివారు. ఇతనిశిష్యులు వానిని వ్రాసికొనెడివారు. ఎప్పుడో యొకప్పుడితడు కవిస్తుతిని ఫలశ్రుతిని చెప్పినాడు. ఇతఁడు దిగంబరయోగిగ నుండెననుటకు క్రిందిపద్యము లుపయోగించును.

"తల్లిగర్భమందుఁ దాబుట్టినప్పుడు మొదల లేదు బట్ట తుదను లేదు
నడుమ బట్టఁగట్ట నగుబాటుకాదొకో విశ్వ,,
"సిగ్గువిడువకున్న శివసౌఖ్యమును లేదు తగ్గ మొగ్గకున్న సిగ్గువిడదు
సిగ్గువిడుచువాడు చిరకాలజీవిరా విశ్వ,,
"సిగ్గువారలమని సృష్టిలోపలివారు వెఱ్ఱివేమనఁగని వెఱగుపడిరి
తనకుఁగల్గుసిగ్గు దైవమెఱుంగురా విశ్వ,,

ఇతడుచ్ఛిష్టము సేవగించుకొనక తినుచుండెను. తినమనుచుండెను.

"ఎంగిలెంగిలనుచు నీళ్లోటితోడను వేదములను జదువు
వెఱ్ఱులార యెంచిచూడనదియు. ఎంగిలి కాదొకో! విశ్వ,,
"అన్నమునకు నంటు నంటయిన నాత్మకు నంటు ఆత్మను పెనగొన్న యన్న
మంటు, ఆత్మశుద్ధి యన్నమన్న శుద్ధియు నాత్మ మినుమన్ను మాడిక్కమై
ఉరయు వేమ,,

వేమన తనజీవితమున నెట్లుండెనో చూతుము.

"పిలిచినఁ బల్కకుండు మఱి పిల్చిన నేమన కూరకుండు దగఁ
దలచిన నెవ్వరేమనినఁ దన్నను గాదని నవ్వుచుండు నా
త్మలవలపోయుచుండు బరతత్వము నిత్యముఁ దానయై సదా
తెలిసిన యోగి వేమనకతిఁ శివరూపుఁ డెల్లతాపులన్,,
"వినియు వినకయుండు వెఱ్ఱివాఁడై యుండు కనియుఁ గనకయుండు
కడగియోగి మనుజవరులచేత మతిపూజఁ గొనుచుండు ॥విశ్వ॥,,

ఇతనికి హేమకారవిద్య తెలియునో తెలియదో చెప్పలేము గాని, దానియందితనికి చాల నమ్మకమున్నదని తెలిసికొన వచ్చును.

"హేమకారవిద్య నెఱిగినవారెల్ల వెతలఁబడనియట్లు విద్యచేత
తత్వమెఱుగువెనుక తనకుచింతేలరా ॥విశ్వ॥,,
"పరుసమినుము సోకి బంగారమైనట్లు,,
తాళకంబుఁ దెచ్చి తాటికమ్మ రసానవంచు నిపుణతఁ దెఱుఁగ
వెండియగును కల్లగాదు నిజము కఱకంఠనీయాన ॥విశ్వ॥,,
"నిమ్మపండు పుల్లై నిజమైన రసముండె హేమమునకు నేస్తుగేల ప్రజలు
సత్తుపొత్తుఁ జేసి సాధింపలేరొకో ॥విశ్వ॥,,

ఇతనికి వైద్యశాస్త్రమునగూడ ప్రజ్ఞకలదని తెలియఁజేయు పద్యములుకలవు.

“ఉప్పుశుద్ధిచేసి యుంచితి నెదువాఁడు ఉప్పుఁదిటవుప వాఁడె
యుంచుజగతి ఉప్పుచూర్ణముఁదినుటొప్పగు కల్పంబు ॥విశ్వ॥,,
“ఉప్పురసము చేర్చి నుదుటుగ సిందూరహారిదళము చేత
హతముచేయఁగ రసవాదమదియె ధరదేయ లేరది ॥విశ్వ॥,,

ఇతనికి గణితసూత్రములుకూడ బాగుగఁదెలియును.

“ఒకటికిక్రింద నొక్కటొనరులబ్ధము వెట్టి వలనుగా గుణింప
వరుసనెరుగునట్టి రీతిచుండు నౌదార్యఫలములు ॥విశ్వ॥,,

ఇతనికి గొప్పగుణములు చాలకలవు. పరధనకాంతలను కూడ దనినాఁడు. దానధర్మములనుచేయుమనినాఁడు. అన్నదానముత్తమమనినాఁడు. పెద్దలయెడగౌరవముంచుమనును. తనమతమును విడువక ఇతరమతములను దూషింపకుండుట ముఖ్యమనును. ఇతని కఠినవిమర్శనమునకుఁ గారణమితఁడు దురాచారములను సహింపలేనివాఁడగుటె. ఇతనికిజంగమమతముపైనభిమానము.

వేమన్న కవిత.

నాల్గువేలకుమించిన పద్యములలో నెన్ని వేమనవో, ఎన్ని వికారమునొందినవో, ఎన్నిటి నితరులుకల్పించినారో, అని తలంచినను, మొత్తముమీఁద వేమనకృతి చాల పెద్దదని తెల్లమగుచున్నది. ఇతనియభిప్రాయప్రకారము “రసాత్మకమ్

కావ్యమనియె కాని యితర లాక్షణికులవలె శబ్దాలంకార ధ్వని ప్రధానము కాదు.

“నిక్కమైన మంచినీల మొక్కటిచాలు, తళుకు బెళుకు రాళ్లు తట్టెడేల
చదువ పద్యమరయఁ జాలదా యొకటైన ॥విశ్వ॥”

కవుల వర్ణనలనిట్లు నిరసించినాడు

“బాలచనులు పూల బంతులఁ బోల్తురు, పాలుమాలినట్టి భ్రష్టులవని
మాంసఖండమందు మఱియేమియున్నది ॥విశ్వ॥”

సత్కవుల నితడు పొగడినాడు

“కామిగానివాఁడు కవిగాఁడు రవిగాఁడు కామిగాక మోక్షకామి కాడు
కామియైనవాడు కవియగు రవియగు ॥విశ్వ॥”

“రవికననిది కవియెఱుఁగును, కవియెఱుఁగనిచోట రవియు
నెఱుగదు ధరలో రవికన్న మిగుల నెక్కుడు కవియై విలసిల్లు నీవు గావలె వేమా”

“తోటకూరకైనను దొగ్గలికైనను, తవుటికుడుముకైన తవిటికైన
కావ్యములను జెప్పు ఘనులెల్ల ధనపరుల్ ॥విశ్వ॥”

అని కుకవి నింద చేసినాడు.

వేమనకవిత జాతీయములతో, చక్కనిలోకోక్తులతో సులభములు సరళములునగు స్వరవర్ణయతులతో ప్రాసములతో వ్యర్థపదములు లేని పాదపూరణములతో, గొప్పయభిప్రాయములు కూడ వాడుకభాషలో చిన్నమాటలతో అనుభవైకవేద్యములును ప్రకృతిసిద్ధములునగు నుపమానములతో మంచినీటి ప్రవాహమువలె నున్నదనుట అతిశయోక్తి కాదు.

వేమనయుపమ లెంతబాగుగనున్నవో చూచుటకు రెండు ఉదాహరణములు చూతము.

ఉప్పుకప్పురంబు నొక్కపోలికనుండు, చూడజూడ రుచులజాడ వేఱు
పురుషులందు పుణ్యపురుషులు వేరయా ॥విశ్వ॥,,

ఇందు రూపము రంగునకును విరుద్ధముగ, రుచి పరిమళము కీర్తియు ఎంతబాగుగ దుర్జనసజ్జనులలో నొప్పినవి! ఇట్లె

"గాజుకుప్పెలోన గడగుచు దీపంబదెట్టులుండు
తెలిసినట్టి వారిదేహంబులందును ॥విశ్వ॥,,

మఱియు "కొండయద్దమందు కొంచెమైయుండదా" ఎంత ప్రకృతిసిద్ధము! కొన్ని కావ్యప్రపంచములోని యుపమలుకలవు. "వెలయువనములోన మలయజంబున్నట్లు" మున్నగున వెన్నో కలవు.

వేమనకు భగవద్గీతలు శైవమతగ్రంథములు హితోపదేశము, పంచతంత్రము, భారతభాగవతములును గరతలామలకములు.

"అరయధర్మమునను నాహరిశ్చంద్రుండు ఆలిబిడ్డనమ్మియతడు
కూడ మాలవానికపుడు మఱిలోకువైయుండె ॥విశ్వ॥,,

అని తనభారతకథాజ్ఞానమును చూపుచున్నాడు.

"నక్కనోటికడ నదిలోనిమీనుకై తిక్కవట్టి విడిచి ముక్కవెట్టె
మక్కువైనగ్రద్ద మాంసమెత్తుకపోయె ॥విశ్వ॥,,

అనిహితోపదేశము ననుకరించినాడు.

ఇతనికి పూర్వవేదాంతపరిచయము కలదు.

"పృథ్వియప్పునందు పుట్టెను గాసుడీ అప్పుపుట్టె నగ్ని నమరజూడ
నగ్ని వాయువందు వాయువాకసమున గల్గి వెలసె కా క్రమము వేమ"

ఇతడనేక సంస్కృత ధర్మములను శ్లోకోక్తులను తెలుగుచేసి విప్పి చెప్పి యున్నాడు.

వేమనయంతరార్థ బోధనములు,

పైకి గానబడు శబ్దము యర్థమొకటి స్పష్టముగ నుండును. భావముమాత్రము బాగుగ తెలియదు. దీనికెవరికితోచినట్లు వారు విప్పియర్థమును చెప్పుదురు.

కాయపిండమాత్రను ఘనముగానుండును మాత్రనుమీదతీగె మలయుచుండు
తీగమీద వేళ్ళు త్రిపురితాండవమాడు ॥విశ్వ॥,

ఈపద్యమునకర్థ మొకరిట్లు వ్రాసిరి

"మనస్సునకు విజ్ఞానమును, విజ్ఞానమునకు ప్రకృతియు, కారణములై ఆ ప్రకృతియందు పరబ్రహ్మములీనమై తాండవమాడుచుండును."

ఇంకొక పద్యముజూడుడు.

"కృష్ణపర్వమందు కృత్తికలైయుండు కృత్తులైదుపట్టి కృష్ణమిగుల
కలయు కృష్ణలైదు వేమనమిగులగా ॥విశ్వ॥,,

దీనికర్థము; అంధకారమయమగు గుహలో వైదుతత్వము లుండును. ఆయేనింటిని మాయమింగెను దానిని వేమన మింగెను (నశింపజేసెను)

ఈక్రిందిపద్యమున కీక్రిందివిధమున వేదాంతు లర్థమున్న దందురు.

"చెప్పులోనిరాయి చెవులోనిజోరీగ కంటిలోనినలుసు కాలిముల్లు
యింటిలోనిపోరు యింతింతగాదయా ॥విశ్వ॥,,

దీనితాత్పర్యమును వంగూరి సుబ్బారావుగారిట్లు వ్రాసినారు.

"నీవు లోని (శరీరమునందలి) తాయినని గాపరమాత్మను జెప్పుము చెవిలోనిప్రణవ నాదమును జెప్పుము. నేనులోని (నాలోని) నలుసునవగా బరమాత్మ కిరణలేశమును గనుగొంటిని (సంసారము) కాలిముల్లనికనుగొంటిని. ఈశరీరమను యింటిలోపోరు సంసారవైరాగ్యముల నడుమనెంతయో కలదు"

పద్యమకుటము.

విశ్వదాభిరామ వినురవేమ! యని సాధారణముగా బ్రతియాటవెలదితుదను వచ్చును. లేదా "వేమనా!" "వేమా" "దేవరవేమా" తుదిపాదమునవచ్చును. కొన్నిపద్యములలో నిదిలేదు. కొన్నిప్రతులలో "విశ్వదాభిరాము" యనియు, "విశ్వ

ధాభిరామ," "విశ్వతోభిరామ" యనియు పాఠాంతరములు కలవు. ఇందలిస్వసంబోధనమును చూచి కొందఱిది వేమనకవి వేమన్నరెడ్డిరాజునుగూర్చి చెప్పెననియు కొందఱిది తనపేరు నభిరామయ్యయను తనగురువుపేరునగలిపి చెప్పెననిరి! ఈ మకుటమునకర్థమనేకులనేకవిధములుగ చెప్పుచున్నారు. బ్రౌనుదొరగారు Listen O Vema! dear to the Lord of all అనియర్థమువ్రాసిరి. అనంతకృష్ణశర్మగారు విశ్వతాభి రామయనుపాఠాంతరమును గ్రహించిప్రపంచత్వముచే నభి రాముడనిరి. అభిరామయ్యకథకాల్పనికము. వేమనతన్ను గూర్చి చెప్పుకొనెననుటకు కొన్నిపద్యముల నాల్గవపాదములను సందర్భానుసారముగ చూచినచో తెలియనగును. తనశిష్యు లకు చెప్పినప్పుడహంకారము కనబడకుండునట్లు తన్నే సం బోధించికొనియుండును. ఇది జ్ఞానియగు వేమన్న అజ్ఞానియ గు తనమనస్సుతో నీవేదాంతమును బోధించినట్లును మనకు తట్టుచున్నది. అని వంగూరు సుబ్బారావుగారనిరి.

పద్యములు—రచన.

నాల్గువేలకుమించినపద్యములలో రమారమి రెండువేల తొమ్మిదివందల యాటవెలదులు, ఆరువందలతొంబది తేట గీతములు, మూడువందల సీసములు, కొన్నిఉత్పలమాలలు, చంపకమాలలు, మత్తకోకిలలు, ఉత్సాహములు, చిత్రపద

ములున్నవి. తత్వపదము కూడ కలదు. ఇతని పద్యములు సులభ శైలిని జ్ఞానబోధకములై చక్కని రచనలో నున్నవి. సీసమునకు శ్రీనాథ చేమకూర లెట్లో, కందమునకు తిక్కన చౌడప్ప లెట్లో వేమన యాట వెలది కట్టివాఁడు.

ఆంధ్రశతక వాఙ్మయమున వేమన

వేరు శాశ్వతముగ నగ్రస్థానమలంకరించినది. ఇతని కవితను, మేధాశక్తిని, తత్వబోధను నీతులను హాస్యరసమును మనవారే కాక పాశ్చాత్యులు కూడ పొగడియున్నారు. వేమన పద్యములను వేఱువేఱు శీర్షికలుగ నీతి మత సంఘ ధర్మ బోధకములుగ విభజించి చూచుకొనినచో, వేమన మన వాఙ్మయమున నెంత ప్రాముఖ్యము జెందినాఁడో తెలిసికొనఁగలము. ఇతఁడు పలుకని సంగతియె లేదు. ఇతడు గ్రీసుదేశపు లూషియన్ మహారాష్ట్రదేశపు తుకారామ్ మున్నగు వేదాంత మహాకవులతో సమానుడు.

సమాప్తము..

ఆంగ్లాయుర్వేదౌషధాలయం,

బెజవాడ.

డాక్టర్ జి. ఎస్. శర్మ,

L. C. P. & S. (Cal.)

లండన్ నగరపు వైట్ కంపెనీవారి ఔషధములకు,

మద్రాసు ఆంధ్రాయుర్వేద ఫార్మసీవారి ఔషధములకు,

ఏజెన్సీ.

సమస్త ప్రాచ్య, పాశ్చాత్య, శాస్త్రీయౌషధములు సరసమగు ధరలకు అమ్మబడును.

ఇగ్లీషు వైద్యశాస్త్రమునననుసరించి రోగములకు, చికిత్స చేయబడును. వైద్యవిషయమున సలహా యివ్వబడును. మావద్దదొరకు,

కొన్ని ఇంగ్లీషుమందులు.	కొన్ని ఆయుర్వేదౌషధములు.
కాడ్లివర్ ఆయిల్	వసంత కుసుమాకరం
సారసపరిల్లా	సిద్ధ మకరధ్వజం
వాసన వెగటులేని ఆముదము	చ్యవనప్రాశము
గాంగ్లిపె(గనేరియా)మంచిమందు	అశోకవటి
	స్తన్యవర్ధకచూర్ణం

వలయువారు పైఅడ్రసుకు వ్రాయుడు.

శారదాభాండారముద్రాశాల,

బెజవాడ.

బెజవాడ గవర్నరు పేటలో శ్రీరామమోహన పుస్తక భాండాగారము సమీపముననున్నది.

తెలుగు, నాగరము, ఇంగ్లీషు

భాషలలో ముద్రణము బహురమ్యముగాను చవుకగాను జేసి త్వరలో యీయఁబడును. లెటరుపేపర్లు, శుభలేఖలు, ప్రకటన పత్రికలు, మొదలగునవి అచ్చుపనులు, బైండింగు పనులు అందముగా సకాలమునకు చేసి యివ్వబడును. వివరములు రేట్లు వగైరాలు తెలుసుకొన గోరువారు యీ క్రింద చిరునామాకు వ్రాయవలెను.

ఇచ్చట దొరుకు గ్రంధములు.

దేవీభాగవతము

తెలుగులిపి గ్లేజుకాగితము, చక్కనిబైండు సుందరమగు ముద్రణము శ్రీ శ్రీ అంకితం వెంకటజగ్గారాయాస్థానపండిత పరిష్కృతము. వెల 2—8—0

చండీ వరివస్యా సర్వస్వము

ఫెదరువెయిటుకాగితము పైనముద్రితము దేవ్యుపాసకుల పాలిచింతామణి. శ్రీ శ్రీ అంకితం వెంకటజగ్గారాయబహద్దరు వారి బహుపరిశ్రమచే ముద్రింపబడినది. అనేకమందిపండితులు మెచ్చుకొన్నది. వెల 2—8—0

ప్రొప్రయిటరు.

శారదా భాండార ముద్రాశాల, బెజవాడ.

సాహితి

నూతన సాహితీఘక్కికలను వెదజల్లు మాసపత్రిక, చక్కని కథలను, సొగసైన గీతములను, మంచిమంచి కవులు కర్తలు వ్రాయుచుందురు. సాహితి ప్రతిభాండారమునందును భాషాసేవకుని గృహమందును ఉండదగిన పత్రిక. మాసాహితీ పత్రికకు తెలుగుజిల్లాలలో మంచి ప్రచారమున్నది. దక్షిణ హైదరాబాదు రాష్ట్రములోకూడ దీనికివ్యాప్తికలదు. ఇదిమాసమునకొకసారి వెలువడును భాషా విషయకమగు మాసపత్రిక, తక్కినవార్తాపత్రికలవలె ఒకసారిచూచి చదివి పారవేయునది కాదు శాశ్వతముగా గ్రంథరూపమున నుండ తగినది. ఒకసారి తెప్పించిచూచిన మీకే తెలియగలదు.

కాబట్టి ప్రకటనలు పంపువారికిన్ని మంచిప్రయోజనము కలిగించును. ప్రకటనధరలకు యీదిగువ అడ్రసుకు వ్రాసిన తెలియగలదు.

సంవత్సర చందా రు 3–0–0 లు మాత్రము.

వలయువారు:—

మేనేజరు.

సాహితి పత్రిక, బెజవాడ.